ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

అనకాపల్లి

జిల్లా వార్తలు

ఆదివారం 11 మే 2025



పాడేరులో పండుగ

నేటి నుంచి మోదకొండమ్మ ఉత్సవాలు

- మూడు రోజుల పాటు నిర్వహణకు భారీ ఏర్పాట్లు
- నేడు శతకంపట్టులో కొలువుదీరనున్న అమ్మవారు

- 8లో



సాగునీటికి ఇక్కట్లు

- దెబ్బతిన్న మదుము, పాడైనగేట్లు
- కాలువలకు పారని నీరు
- రెండు వేల ఎకరాలకు నీరు అందక రైతుల ఇక్కట్లు
- పదేళ్ల నుంచి ప్రతిపాదనల్లోనే మరమ్మతులు

శిథిలమైన ధారగెడ్డ ఆనకట్ట



శిథిలమైన ధారగెడ్డ ఆనకట్టు

గొలుగొండ, మే 10 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని ధారగెడ్డ మొదటి ఆనకట్ట శిథిలావస్థకు చేరడంతో ఆయకట్టుకు నీరు సరిగా అందక రైతులు ఇబ్బంది పడుతున్నారు. మదుములు, ఆనకట్ట మరమ్మతులు చేయాలని పదేళ్ల నుంచి విజ్ఞప్తి చేస్తున్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలోని పాతమల్లంపేట పంచాయతీ పరిధిలోని కొండల్లో కురిసిన వర్షం నీరు ధారగెడ్డ ద్వారా ప్రవహిస్తుంది. ఏడాది పొడవునా నీటి ప్రవాహం వుండడంతో చాలా ఏళ్ల క్రితం ఆనకట్ట నిర్మించారు. దీనిద్వారా సుమారు రెండు వేల ఎకరాలకు నీరు అందుతుంది. ఏటా ఖరీఫ్, రబీలో రైతులు వరి పంటను సాగు చేస్తుంటారు. అయితే కాలక్రమేణా ఆనకట్ట, మదుము శిథిలావస్థకు చేరుకున్నాయి. మదుము గేటు పాడైపోయింది. దీంతో కాలువల ద్వారా పంట పొలాలకు నీరు అందక రైతులు ఇబ్బంది పడుతున్నారు. మరమ్మతులు చేయించాలని ఇరిగేషన్ అధికారులను తరచూ కోరుతున్నారు. కానీ ఇంతవరకు ఎవరూ పట్టించు కోలేదు. ధారగెడ్డ నీరు పంట పొలాలకు మళ్లకుండా వృథాగా పోతున్నదని రైతులు వాపోతున్నారు.

కాగా మండలంలో వంద ఎకరాల లోపు ఆయకట్టు కలిగిన చెరువులు 112 వుండగా, వంద ఎకరాలకుపైబడి ఆయకట్టు వున్న ఆనకట్టలు ఏడు వున్నాయి. మొత్తం 13 సాగునీటి సంఘాలకు రెండు నెలల క్రితం ఎన్నికలు జరిగి కమిటీలు ఏర్పాటయ్యాయి. కానీ ఇంతవరకు నీటి వనరుల మరమ్మతుల గురించి పట్టించుకోలేదని రైతులు ఆరోపిస్తున్నారు. సాగునీటి వనరులకు మరమ్మతుల కోసం ఏటా ప్రతిపాదనలు తయారుచేయడం, ప్రభుత్వానికి పంపడం, ఆమోదం లభించకపోవడం ఆనవాయితీగా మారిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది కూడా మొత్తం 43 పనులకు రూ.6 కోట్లు మంజూరు కోసం సంబంధిత అధికారులు ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపారు. మరో నెల రోజుల్లో ఖరీఫ్ సీజన్ ఆరంభం అవుతుందని, సాగునీటి వనరుల్లో పూడికతీత, మరమ్మతు పనులు ఈలోగానే చేపట్టాలని రైతులు కోరుతున్నారు. కాగా సాగు వనరులకు మరమ్మతులపై ఇరిగేషన్ జేఈ రవికిరణ్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, ధారగెడ్డ ఆనకట్ట మరమ్మతులు, పంట కాలువల్లో పూడిక తీత, గేట్లకు మరమ్మతు పనులకు ఆరు కోట్ల రూపాయలు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.



పాతమల్లంపేట వీరయ్యదొర చెరువులో పెరిగిపోయిన తూటుకాడ మొక్కలు

ఏటా ప్రతిపాదనలకే పరిమితం



ధారగెడ్డలో ఏడాది పొడవునా నీటి ప్రవాహం వుంటుంది. కానీ ఆనకట్ట శిథిలావస్థకు చేరడంతో కాలువలకు నీరు ప్రవహించడం లేదు. దీంతో పంటలకు నీరు సరిగా అందక ఇబ్బంది పడు తున్నాం. ఆనకట్ట, మదుములకు మరమ్మతులు చేయిం చాలని ఎన్నోసార్లు అధికారులను కోరాం. ఏటా ప్రతిపా దనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపడం, బుట్టదాఖలు చేయడం ఆనవాయితీగా మారింది. **లెక్కల నానాజీ, రైతు, పాతమల్లంపేట**

పాఠశాలల పునర్వ్యవస్థీకరణ

ఇకపై 7 ఏడు రకాలు

- ఉమ్మడి జిల్లాలో మొత్తం 3,158 పాఠశాలలు, పూర్తయిన కసరత్తు...
- ప్రభుత్వానికి నివేదిక
- నేడో, రేపో అధికారికంగా ఉత్తర్వులు



విశాఖపట్నం, మే 10 (ఆంధ్రజ్యోతి):

పాఠశాలల పునర్వ్యవస్థీకరణపై గత వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 117ను ఇటీవల కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. ఈ నేపథ్యంలో ఐదు రకాల పాఠశాలలను ఏర్పాటుచేయాలని తొలుత భావించిన విద్యా శాఖ...తాజాగా తొమ్మిదిగా విభజించాలని నిర్ణయించింది. అయితే ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎక్కడ కూడా ప్రాథమిక పాఠశాలలు మూసివేయనందున శాటిలైట్ పాఠశాలల ఏర్పాటు అవసరం పడలేదు. దీంతో మిగిలిన జిల్లాలకు భిన్నంగా ఉమ్మడి విశాఖ జిల్లాలో మాత్రం ఏడు రకాల పాఠశాలలు మాత్రమే ఏర్పాటు చేస్తున్నారు. అవి...ఫౌండేషన్, బేసిక్ ప్రాథమిక, మోడల్ ప్రాథమిక పాఠశాలలు, యూపీ పాఠశాలలు, ఉన్నత పాఠశాలలు, ఉన్నత పాఠశాలలు ప్లస్ బేసిక్ ప్రాథమిక పాఠశాలలు, ఉన్నత పాఠశాలలు ప్లస్ మోడల్ ప్రాథమిక పాఠశాలలు.

అనకాపల్లి జిల్లాలో...

ఫౌండేషన్-151, బేసిక్ ప్రాథమిక-764, మోడల్ ప్రాథమిక-187 ప్రాథమికోన్నత-55, ఉన్నత పాఠశాలలు-145, ఉన్నత పాఠశాలలు ప్లస్ బేసిక్ ప్రాథమిక పాఠశాలలు 78, ఉన్నత పాఠశాలలు ప్లస్ మోడల్ ప్రాథమిక పాఠశాలలు 18

ఉమ్మడి జిల్లాలో ఇప్పటివరకూ ఉన్న 3,158 పాఠశాలలను ఏడు రకాలుగా మార్పు చేస్తూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. దీని ప్రకారం 228 ఫౌండేషన్ పాఠశాలలు, 1,921 బేసిక్ ప్రాథమిక పాఠశాలలు, 563 మోడల్ ప్రాథమిక పాఠశాలలు, 89 యూపీ పాఠశాలలు, 237 ఉన్నత పాఠశాలలు, 88 ఉన్నత పాఠశాలలు ప్లస్ బేసిక్ ప్రాథమిక పాఠశాలలు, 32 ఉన్నత పాఠశాలలు ప్లస్ మోడల్ ప్రాథమిక పాఠశాలలు ఉంటాయి. వీటికి సంబంధించి ... మిగతా 8వ పేజీలో

ఎలమంచిలి మునిసిపాలిటీలో వేడెక్కిన రాజకీయం

వైస్‌చైర్మన్ పదవులను ప్రతిష్ఠాత్మకంగా భావించిన ఇరువర్గాలు

- కౌన్సిలర్లు జారిపోకుండా శిబిరాలకు తరలింపు
- 12 మందితో ఊటీ వెళ్లిన చైర్‌పర్సన్ వర్గీయులు
- రంగంలోకి దిగిన వైసీపీ పెద్దలు
- ఆరుగురు కౌన్సిలర్లు చెన్నైకి తరలింపు
- అవిశ్వాసంపై ఎవరి ధీమా వారిది



ఎలమంచిలి మునిసిపల్ కార్యాలయం

ఎలమంచిలి, మే 10 (ఆంధ్రజ్యోతి):

ఎలమంచిలి మునిసిపాలిటీలో మరోసారి క్యాంపు రాజకీయాలకు తెరలేచింది. వైస్‌చైర్మన్లపై అవిశ్వాస తీర్మానం వీగిపోయేలా వైసీపీ నాయకులు, అవిశ్వాస తీర్మానం నెగ్గేలా కూటమి నేతలు.. ఎవరి ప్రయత్నాల్లో వారు వున్నారు. అవిశ్వాస తీర్మానం నోటీసుపై సంతకాలు చేసిన కౌన్సిలర్లను కూటమి నేతలు తమిళనాడు రాష్ట్రం ఊటీ తరలించగా, నోటీసుపై సంతకాలు చేయని కౌన్సిలర్లలో కొంతమంది మందిని వైసీపీ నాయకులు చెన్నై పంపారు. అవిశ్వాస నోటీసుపై కౌన్సిల్ ప్రత్యేక సమావేశం జరిగే వరకు కౌన్సిలర్లు ఆయా ప్రాంతాల్లోని శిబిరాల్లోనే వుంటారని సమాచారం.

ఎలమంచిలి మునిసిపల్ వైస్‌చైర్మన్లు బెజవాడ వెంకట గోవిందరాజు నాగేశ్వరరావు, ఆరెపు నాగ త్రినాథ ఈశ్వర గుప్తాలపై అవిశ్వాసం ప్రకటిస్తూ మునిసిపల్ అధికారులకు గురువారం నోటీసు అందజేసిన సంగతి తెలిసిందే. ఈ నోటీసుపై పిల్లా రమాకుమారితో సహా మొత్తం 16 మంది కౌన్సిలర్లు సంతకాలు చేశారు. దీంతో వైస్‌చైర్మన్లను పదవుల నుంచి దించేయాలని చైర్‌పర్సన్ వర్గీయులు, అవిశ్వాస తీర్మానం ఎలాగైనా వీగిపోయేలా చేయాలని వైసీపీ నాయకులు గట్టి పట్టుదలతో వున్నారు. తమ సభ్యులను కాపాడుకునేందుకు ఇరుపక్షాల వారు క్యాంపు రాజకీయాలకు తెరలేపారు. తొలుత చైర్‌పర్సన్ వర్గీయులు.. అవిశ్వాస నోటీసుపై సంతకాలు చేసిన 15 మందిని ఊటీ తరలించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. శనివారం సాయంత్రం ప్రత్యేక బస్సులో బయలుదేరే సమయంలో వీరిలో ముగ్గురు కౌన్సిలర్లు ఏదో సాకు చెప్పి, ఊటీ వెళ్లకుండా జారుకున్నారు. ఇదే సమయంలో వైసీపీకి చెందిన ముఖ్య నేతలతోపాటు, కొందరు కౌన్సిలర్లు, వైస్ చైర్మన్‌లతో ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, కన్నబాబురాజు సమావేశమయ్యారు. చైర్‌పర్సన్ రమాకుమారిని పదవి నుంచి దించేయడానికి సరిపడ బలం వున్నప్పటికీ.. అతిధీమాతో అవకాశాన్ని చేజార్చుకున్నామని, వైస్‌చైర్మన్‌ల పదవులను కాపాడుకునే విషయంలో అలా జరుగకూడదని పార్టీ పెద్దలు స్పష్టం చేసినట్టు తెలిసింది. దీంతో అవిశ్వాస నోటీసుపై సంతకాలు చేయని కౌన్సిలర్లలో ఆరుగురిని చెన్నై తరలించినట్టు సమాచారం. సంతకాలు చేసిన వారిలో ముగ్గురితోపాటు మరో ముగ్గురు ఎలమంచిలిలోనే వున్నారు. వైస్ చైర్మన్‌లపై అవిశ్వాస తీర్మానం నెగ్గాలంటే 17 మంది అవసరం. నోటీసుపై సంతకాలు చేసినవారితోపాటు ఎక్స్‌అఫీషియో సభ్యుడైన ఎమ్మెల్యే మద్దతు ఇస్తే అవిశ్వాస తీర్మానం నెగ్గుతుంది. ఒక్కరు తగ్గినాసరే వీగిపోతుంది. నోటీసుపై సంతకాల చేసిన వారిలో కనీసం ఒక్కరినైనా తమవైపునకు తిప్పుకోవడంతోపాటు తమ శిబిరంలో వున్నవారు జారిపోకుండా చూసుకోవాలని వైసీపీ నేతలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

భారత్‌తో పెట్టుకుంటే పాక్ నాశనమే

ఆ విషయం ఆ దేశానికి కూడా తెలుసు

- పౌరులు, ప్రపంచం ముందు చులకన కాకూడదనే మేకపోతు గాంభీర్యం
- భారత్ డిఫెన్స్ సిస్టమ్ అద్భుతం
- పాక్ ప్రయోగించిన మిస్సైల్స్‌ను నేలకూల్చడమే అందుకు నిదర్శనం
- మన సైన్యాన్ని ఎదుర్కోవడం పాకిస్థాన్‌కు అసాధ్యం
- కరాచీ పోర్టుపై దాడి జరిగితే ఆ దేశం ఇప్పట్లో కోలుకోవడం సాధ్యం కాదు
- 'ఆంధ్రజ్యోతి'తో రిటైర్డ్ నేవీ ఉద్యోగి, యుద్ధ సేవా మెడల్, నౌసేనా మెడల్ గ్రహీత **కమోడోర్ ఆదిమూలం చిన వెర్రియ్య**
- 1971లో పాకిస్థాన్‌తో యుద్ధ సమయంలో 'ఐఎన్ఎస్ కుఠార్' యుద్ధనౌకలో సిగ్నల్ కమ్యూనికేషన్ ఆఫీసర్‌గా విధుల నిర్వహణ

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



ఆదిమూలం చిన వెర్రియ్య

విశాఖపట్నం, మే 10 (ఆంధ్రజ్యోతి):

భారత్‌తో పెట్టుకుంటే పాకిస్థాన్ నాశనం కావడం ఖాయమని, ఈ విషయం ఆ దేశానికి కూడా తెలుసునని రిటైర్డ్ నేవీ ఉద్యోగి, యుద్ధ సేవా మెడల్, నౌ సేనా మెడల్ గ్రహీత కమోడోర్ ఆదిమూలం చినవెర్రియ్య పేర్కొన్నారు. పాకిస్థాన్‌తో 1971లో జరిగిన యుద్ధంలో పాల్గొన్న ఆయన...భారత్, పాకిస్థాన్ మధ్య తాజాగా నెలకొన్న పరిస్థితులపై శనివారం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడారు. పాకిస్థాన్‌తో పోలిస్తే భారత్ కొన్ని రెట్లు బలంగా ఉందని, ఈ విషయం ఆ దేశానికి కూడా తెలుసునన్నారు. ఆ దేశ ప్రజలు, ప్రపంచం ముందు తాము వెనక్కి తగ్గడం లేదన్న విషయాన్ని చెప్పుకునేందుకు సాధారణ పౌరులపై కాల్పులు, దాడులకు తెగబడుతోందని చినవెర్రియ్య వ్యాఖ్యానించారు. అయితే, భారత్ డిఫెన్స్ సిస్టమ్ అద్భుతంగా పనిచేస్తోందని, దీనివల్ల అనేక మిస్సైల్స్‌ను నేలకూల్చి ప్రజలకు ప్రాణ నష్టం లేకుండా చేయగలిగిందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలు ఆయన మాటల్లోనే...

పాకిస్థాన్‌తో యుద్ధంలో సేవలు..

1970లో నౌకాదళంలో కమిషన్డ్ ఆఫీసర్‌గా చేరా. విధుల్లో చేరిన ఏడాదికే అంటే 1971లో పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో ... మిగతా 8వ పేజీలో

తాండవ కాలువలకు కొత్త రూపు

ఐదేళ్ల తరువాత పూడికతీత





- ఉపాధి హామీ పథకం కింద శరవేగంగా పనులు
- ఖరీఫ్ ఆరంభంనాటికి పూర్తిచేయాలని లక్ష్యం
- ఆయకట్టు చివరి భూములకు తొలగనున్న సాగునీటి కష్టాలు
- కూటమి ప్రభుత్వానికి రైతుల కృతజ్ఞతలు

నాతవరం మండలం మాధవనగరం వద్ద తాండవ కాలువలో పూడిక తీసిన తరువాత.. (ఇన్‌సెట్‌లో) కాలువలో పూడిక తీయకముందు..

నాతవరం, మే 10 (ఆంధ్రజ్యోతి):

తాండవ ఆయకట్టు కాలువలు కొత్త రూపును సంతరించుకుంటున్నాయి. కూటమి ప్రభుత్వం సాగు నీటి వనరుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇవ్వడమేకాకుండా సత్వరమే నిధులు సైతం మంజూరు చేస్తున్నది. దీంతో పంట కాలువల్లో పూడికతీత, మదుముల మరమ్మతు పనులు శరవేగంగా సాగుతున్నాయి. తాండవ రిజర్వాయర్ నుంచి ఖరీఫ్‌కు సాగునీరు విడుదల చేసేనాటికి ఈ పనులన్నీ పూర్తి చేయాలని అధికారులు, నీటి సంఘాల ప్రతినిధులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్క ఏడాది కూడా తాండవ రిజర్వాయర్ పంట కాలువలు పూడికతీతకు నోచుకోలేదు. ఎక్కడికక్కడ తూటుకాడ, మట్టి, పిచ్చిమొక్కలు పెరిగిపోయి నీటి ప్రవాహం మందగించింది. దీనివల్ల ఆయకట్టు చివరి భూములకు సకాలంలో నీరు అందని పరిస్థితి నెలకొంది. దీనివల్ల దమ్ము, వరినాట్లు పనులు ఆలస్యం అయ్యేవి. అంతేకాక పొట్ట, కంకి దశల్లో నీటి ఎద్దడికి గురై ధాన్యం దిగుబడి తగ్గిపోతున్నది. కాలువల్లో పూడికలు తీయించి సాగునీటి కష్టాల నుంచి గట్టెక్కించాలని తాండవ రైతులు నాటి పాలకులు, అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేశారు. కానీ ఒక్క ఏడాది కూడా పూడిక తీయించిన పాపాన పోలేదు. ఈ నేపథ్యంలో కూటమి అధికారంలోకి రావడంతో రైతుల ఆశలు చిగురించాయి. తాండవ ... మిగతా 8వ పేజీలో



అతిథి గృహాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ అయ్యన్నపాతురడు

నర్సీపట్నంలో పీఆర్ అతిథిగృహం

రూ.కోటి వ్యయంతో నిర్మాణం ▸ ప్రారంభించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం అర్బన్, మే 10 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నంలో సుమారు కోటి రూపాయల వ్యయంతో నర్సీపట్నం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్మించిన పంచాయతీరాజ్ శాఖ అతిథిగృహాన్ని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు శనివారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు బస చేసేందుకు ఈ అతిథిగృహం ఉపయోగ పడుతుందని చెప్పారు. రానున్న రోజుల్లో తన క్యాంపు కార్యాలయంగా ఉపయోగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రాజేశ్, తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ సూర్యచంద్ర, వేములపూడి ఎంపీటీసీ సభ్యుడు బోళెం రాంప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీరంగాస్వామి, తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురానికి మహర్దశ

గాజువాక నుంచి ఎలమంచిలి వరకు 180 అడుగుల రోడ్డు

- స్టీల్ ప్లాంట్ పరిధిలో ఫ్లైఓవర్ వంతెన
- 100 నుంచి 120 అడుగుల వెడల్పుతో అచ్యుతాపురానికి రింగ్ రోడ్డు
- ఇప్పటికే భూసేకరణ పూర్తి
- మూడు నెలల్లో పనులు ప్రారంభం
- ఎమ్మెల్యే విజయ కుమార్ వెల్లడి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం, మే 10 (ఆంధ్రజ్యోతి):

గాజువాక నుంచి పరవాడ, అచ్యుతాపురం మీదుగా ఎలమంచిలి వద్ద హైవే వరకు ప్రస్తుతం వున్న ఆర్అండ్‌బీ రహదారిని 180 అడుగులకు విస్తరించడానికి సవివర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధమైందని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్ చెప్పారు. శనివారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ, కూర్మన్నపాలెం జంక్షన్ నుంచి దేశపాత్రునిపాలెం వరకు స్టీల్ ప్లాంట్‌పరిధిలో ఫ్లై ఓవర్ వంతెన వస్తుందని తెలిపారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న అచ్యుతాపురానికి నాలుగువైపులా వున్న రహదారులను అనుసంధానం చేయడానికి ప్రణాళికను రూపొందించామని చెప్పారు. ఇందులో ... మిగతా 8వ పేజీలో

13న సైనికులకు మద్దతుగా తమిళనాడులో ప్రత్యేక పూజలు

» ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుందరపు

అచ్యుతాపురం, మే 10 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ సిందూర్ పోరాటంలో ఉన్న సైనికులతో పాటు ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి భగవంతుని ఆశీస్సులు మెండుగా ఉండాలని కోరుకుంటూ మంగళవారం సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తెలిపారు. శనివారం ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆరు షణ్ముఖ క్షేత్రాలలో ప్రత్యేక పూజలు నిర్వహించాలని నిర్దేశించారన్నారు. ఇందులో భాగంగా తాము ప్రముఖ షణ్ముఖ క్షేత్రాల్లో ఒకటైన తమిళనాడు రాష్ట్రంలోని మధురై పక్కన గల తిరుపంర కుండ్రమ్‌లో వచ్చే మంగళవారం ఈ పూజలు చేయనున్నట్టు చెప్పారు. ఆదివారం సాయంత్రం ఇక్కడి నుంచి ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేస్తున్నామని, కూటమి నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జనపరెడ్డి శ్రీనివాసరావు, బైలపూడి శ్రీరామ దాసు, మోటూరు శ్రీవేణి, పిన్నమ రాజు వాసు, టెక్కలి పరశురామ్, ద్వారపురెడ్డి బాపూజీ పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయాల్లో నాయకుల పూజలు

ఎలమంచిలి : యుద్ధంలో భారత సైనికుల విజయాన్ని కాంక్షిస్తూ స్థానిక నాయకులు శనివారం ఇక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మునిసిపల్ మాజీ వైస్ ఛైర్మన్ కొఠారు సాంబ, బీజేపీ నేతలు పప్పు ఈశ్వరరావు, పిట్టా దాసుబాబు, స్థానికులు నాయకులు దొడ్డ నాగేశ్వరరావు, వేగి నాయుడు, అతికం శెట్టి పైడికొండ, గుర్రాల రామలక్ష్మణులు తదితరులంతా కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో పూజలు జరిపారు. అలాగే, సోమలింగపాలెం, పాతవీధి, కట్టుపాలెం, తురువుపల్లి, కొత్తపాలెం తదితర చోట్ల ఉన్న ఆలయాల్లోనూ పూజలు జరిపారు.

నేడు టైలర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సమావేశం

ఎలమంచిలి, మే 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పీవీ కాంప్లెక్సు ఆవరణలో ఆదివారం ఉదయం 10 గంటలకు న్యూ నవ్యాంధ్ర రాష్ట్ర టైలర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ప్రతినిధుల సమావేశం జరగనుందని ఎలమంచిలి మండల అధ్యక్షుడు వియ్యపు సత్యనారాయణ, టైలర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ మండల అధ్యక్షుడు సత్యనారాయణ తెలిపారు. టైలర్ల సంక్షేమంతో పాటు అభి వృద్ధికి సంబంధించిన కార్యాచరణపై చర్చించనున్నట్టు వివరించారు.

శిథిల భవనంలో భయం..భయం..

» మండల పరిషత్ కార్యాలయంలో పెచ్చులూడి పడుతున్న శ్లాబ్ » గదుల్లో బీటలు వారిన గోడలు » ఇబ్బందుల నడుమ సిబ్బంది విధులు

రాంబిల్లి, మే 10 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి మండల పరిషత్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఇది చూసిన సిబ్బంది బితుకు బితుకుమంటూ విధులు నిర్వహిస్తుండగా, వివిధ పనులపై వచ్చిన ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈ భవనాన్ని 2002 జనవరి 22వ తేదీన అప్పటి పార్లమెంటు సభ్యులు దివంగత కింజరాపు ఎర్రన్నాయుడు ప్రారంభించారు. కొన్నాళ్ల పాటు బాగానే ఉన్న ఈ భవనం నిర్వహణను పట్టించుకునేవారు లేకపోవడంతో ప్రస్తుతం శిథిల స్థితికి చేరుకుంది. శ్లాబ్ పెచ్చులూడి పడుతుండడంతో ఇనుప ఊచలు బయటకు కనిపిస్తున్నాయి. కిటికీల సన్ షేడ్‌లు విరిగిపోయాయి. గదుల్లోని గోడలు బీటలు వారి దర్శనమిస్తున్నాయి. కార్యాలయం ముఖద్వారం



పగుళ్లు ఏర్పడి పెచ్చులూడిన పిల్లర్



శిథిలావస్థకు చేరిన మండల పరిషత్ కార్యాలయ భవనం

వద్ద పిల్లర్లకు పగుళ్లు ఏర్పడ్డాయి. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని అంతా హడలిపోతున్నారు. వర్షాలు కురిసేటప్పుడు ఆ నీరు గదుల్లోకి చేరుతుండడంతో సిబ్బంది ఇబ్బందులు పడుతూ విధులు నిర్వహిస్తున్నారు. భవనం దుస్థితి ఇంతలా ఉన్నా కనీస మరమ్మతులు చేపట్టకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను ఎంపీడీవో జయమాధవి వద్ద ప్రస్తావించగా, కార్యాలయ భవనం పరిస్థితిని జిల్లా అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినట్టు చెప్పారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి భవనానికి మరమ్మతులు చేపట్టాల్సిందిగా అంతా కోరుతున్నారు.

నేడు నాలుగు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాంబిల్లి, మే 10 (ఆంధ్రజ్యోతి) : కొత్తూరు సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ లైన్ల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా ఆదివారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏపీ ఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా గోకివాడ ఫీడర్‌లోని కొత్తూరు, గోకివాడ, మూలకొత్తూరు, మూలజంప గ్రామాల్లో ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని వివరించారు. విద్యుత్ వినియోగదారులు ఇందుకు సహకరించాల్సిందిగా కోరారు.

భారీ వృక్షాల తొలగింపు ఆరంభం

» అనకాపల్లి- అచ్యుతాపురం రోడ్డు విస్తరణలో భాగంగా..

మునగపాక, మే 10 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి- అచ్యుతాపురం ప్రధాన రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా భారీ వృక్షాల తొలగింపు పనులు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా మండలంలోని ఒంపోలు, నాగులాపల్లి తదితర గ్రామాల పరిధిలో ఉన్న భారీ నుంచి అతి భారీ వృక్షాలను తొలగిస్తున్నారు. ఈ రోడ్డు మార్గంలో అత్యధికంగా అశోకచెట్లు ఉన్నాయి. ఇవి వందల సంవత్సరాలు చరిత్ర కలిగినవి. వేసవి కాలంలో పాదచారులతో పాటు ఇటుగా రాకపోకలు



తొలగించిన చెట్ల దుంగలను వాహనాల ద్వారా తరలింపునకు సన్నాహాలు



కొద్ది రోజుల్లో కనుమరుగు కానున్న భారీ వృక్షాలు

సాగించేవారికి నీడనిస్తున్నాయి. అంతేకాకుండా పచ్చదనంలో కళకళలాడుతున్నాయి. ప్రస్తుతం వీటిని తొలగిస్తుండడంతో పర్యావరణ ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా ఈ చెట్ల తొలగింపు పనులు జరుగుతున్నాయని ఆర్అండ్‌బీ జేఈ పద్మిని తెలిపారు.

సాగునీటి కాలువ ఇలా.. పొలాలకు నీరు చేరేదెలా..?

» ఈదురు గాలులు, వర్షాలకు పలు చోట్ల కూలిన చెట్ల కొమ్మలు

» తొలగించకపోవడంతో అన్నదాతల ఆగ్రహం



కృష్ణంరాజు కాలువలో పడివున్న చెట్టు కొమ్మలు

మునగపాక, మే 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సాగునీటి కాలువల్లో పలు చోట్ల చెట్ల కొమ్మలు అడ్డదిడ్డంగా పడి ఉండడంతో పంట పొలాలకు నీరు పారేందుకు సీజనల్‌లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం ఎండా కాలం కారణంగా కాలువల్లో నీరు లేకపోయినా వీటి తొలగింపు ప్రక్రియ మాత్రం చేపట్టలేదు. ఈదురు గాలులు, భారీ వర్షాలకు చెట్లు, కొమ్మలు ఆవకాలువ, కృష్ణంరాజు కాలువ వంటి వాటిలో పడి ఉన్నాయి. వీటిని తొలగించాలని రైతులు కోరుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. ఇలా అయితే విస్తారంగా వర్షాలు కురిసేటప్పుడు పంట పొలాలకు నీరు ఎలా చేరుతుందని పలువురు రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇలా కూలి పడివున్న చెట్ల కొమ్మలను తొలగించాలని వారంతా కోరుతున్నారు.

కొత్త వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇవ్వండి : సీఐ



మాట్లాడుతున్న సీఐ సింహాద్రి

అచ్యుతాపురం, మే 10 (ఆంధ్రజ్యోతి) : సముద్రంలో వేటకు వెళ్లే సమయంతో పాటు తీర ప్రాంతంలో అపరిచిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని పూడిమడక మెరైన్ పోలీస్ సీఐ సింహాద్రి నాయుడు అన్నారు. మత్స్యకార గ్రామమైన పూడిమడకలో శనివారం రాత్రి ఆయన పల్లె నిద్ర చేశారు. ఈ సందర్భంగా మత్స్యకారులతో మాట్లాడుతూ వేటకు వెళ్లే సమయంలో సముద్రంలో కొత్త పడవలతో పాటు కొత్త వ్యక్తులు కనిపిస్తే గుర్తించి తెలపాలన్నారు. అంతా కలిసి కట్టుగా పనిచేసి దేశాన్ని రక్షించుకోవాలని సూచించారు.


ఎన్‌సీసీ ఆటల పోటీల్లో 'పేట' విద్యార్థినుల ప్రతిభ



వివిధ ఆటల పోటీల్లో ప్రతిభ చూపిన శ్రీప్రకాష్ ఎన్‌సీసీ విద్యార్థినులు

పాయకరావుపేట, మే 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సమీపంలో 3వ ఆంధ్రా ఎన్‌సీసీ బాలికల బెటాలియన్ నిర్వహించిన ఆటల పోటీల్లో పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యార్థులు అద్భుత ప్రతిభ చాటారు. 3వ ఆంధ్రా ఎన్‌సీసీ బాలికల బెటాలియన్ వార్షిక శిక్షణ శిబిరం ఈనెల 1వ తేదీ నుంచి శనివారం వరకు పది రోజులపాటు కాకినాడ జిల్లా సూరంపాలెంలో నిర్వహించింది. ఈఆటల పోటీల్లో జూనియర్స్ విభాగంలో శ్రీప్రకాష్ విద్యానికేతన్ విద్యార్థినులు సోలో సాంగ్ పోటీలో మొదటి స్థానం, ఖో ఖో, చెస్‌లో రెండవ స్థానంలో నిలిచి ఒక బంగారు, 10 వెండి పతకాలు సాధించారు. సీనియర్స్‌లో శ్రీప్రకాష్ జూనియర్ కళాశాల విద్యార్థినులు బాడ్మింటన్‌లో మొదటి స్థానం, గ్రూప్ సాంగ్, ఖోఖో పోటీల్లో ద్వితీయ స్థానం, ఒక బంగారు, 13 వెండి పతకాలు సాధించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో విజేతలకు క్యాంప్ కమాండెంట్ కల్నల్ హెచ్ఎస్.మానిక్, గ్రూప్ కమాండర్ రితిన్ మోహన్ ఆగర్వాల్, ఎస్ఎం.గులాబ్‌సింగ్ చేతుల మీదుగా పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ విద్యార్థులకు విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సీహెచ్. విజయ్‌ప్రకాష్ తదితరులు అభినందించారు.

'పేట' తహసీల్దారుగా ఆనంద్



బాధ్యతలు స్వీకరించిన జి.ఆనంద్

పాయకరావుపేట, మే 10 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట తహసీల్దారుగా జి.ఆనంద్ నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ తహసీల్దారుగా పనిచేసి జి.సత్యనారాయణ కశింకోటకు బదిలీకాగా.. ఈయన స్థానంలో ఇదే కార్యాలయంలో డీటీగా పనిచేస్తున్న జి.ఆనంద్‌కి తహసీల్దారుగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. దీంతో శనివారం జి.ఆనంద్ బాధ్యతలు చేపట్టారు.

మాతృ ప్రేమకు 'కళా'భివందనం



చెక్కపై కార్పెంటర్ రవి తయారు చేసిన తల్లీబిడ్డల రూపం

నక్కపల్లి, మే 10 (ఆంధ్రజ్యోతి): మదర్స్ డే (ఈ నెల 11) సందర్భంగా మండలం చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన కళాకారుడు దార్ల రవి చెక్కపై తల్లీ బిడ్డల రూపాలను చెక్కాడు. కార్పెంటర్‌గా జీవనోపాధి చెందుతున్న రవి సందర్భానుసారం తన నైపుణ్యంతో పలు కళాఖండాలను తయారు చేస్తుంటారు. తాజాగా మదర్స్‌డే పురస్కరించుకుని చెక్కపై తల్లి బిడ్డను లాలిస్తున్నట్టు మాతృప్రేమకు ప్రతిరూపంగా తయారు చేశారు. దీని తయారీకి తనకు గంటన్నర సమయం పట్టిందని అతను తెలిపారు.

మూగజీవాల దాహార్తి తీర్చేందుకు నీటి తొట్టెలు

» నక్కపల్లి మండలంలో 12 చోట్ల నిర్మాణాలు పూర్తి

» ప్రభుత్వ నిర్ణయంపై రైతులు హర్షం

నక్కపల్లి, మే 10 (ఆంధ్రజ్యోతి): మండు వేసవిలో బయకు వెళ్లిన కాసేపటికే దాహంతో మనం అల్లాడిపోతుంటాం. అలాంటిది ఈ సీజన్‌లో మూగ జీవాల పరిస్థితి మరీ దారుణం. ఏప్రిల్ నుంచి జూన్ వరకూ వేసవి ప్రభావంతో చెరువులు, పంట కాలువలు ,బావులు ఎండిపోతుంటాయి. ఈ సమయంలో పాడి పశువులకు నీరు పట్టేందుకు అన్నదాతలు నరకయాతన పడుతుంటారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం వేసవిలో మూగజీవాల దాహార్తి తీర్చేందుకు చర్యలు తీసుకుంటోంది. గోవులు, గేదెలు, మేకలు, గొర్రెలు, ఇతర పశు, పక్ష్యాదులకు నీరు అందుబాటులో ఉండేలా నీటి తొట్టెల నిర్మాణ పనులను ప్రభుత్వం చేపడుతోంది. ఉపాధి హామీ పథకంలో భాగంగా పలు గ్రామాల్లో మూగజీవాల కోసం ఈ నీటి తొట్టెలను నిర్మిస్తున్నారు. 5.15 మీ. పొడవు, 2.15 మీ. వెడల్పుతో సుమారు రూ. 35వేల ఉపాధి నిధులతో తొట్టెలను నిర్మిస్తున్నారు. మండలంలో ఇప్పటి వరకూ 12 నీటి తొట్టెలు పూర్తయ్యాయి. జిల్లాలో 646 పంచాయతీలకు గానూ మొదటి దశలో 450 పంచాయతీల్లో నీటి తొట్టెలను నిర్మించాలని జిల్లా అధికారులు లక్ష్యాన్ని నిర్ణయించారు. ఒక్కో నీటి తొట్టెలో 6వేల లీటర్ల నీరు నిల్వ ఉండేలా నిర్మిస్తున్నారు.



:జానకయ్యపేటలో నిర్మించిన ట్యాంకులో నీటి తాగుతున్న పశువులు

ఘనంగా మదర్స్‌డే వేడుకలు



గొల్లపేటలో తల్లులను సన్మానిస్తున్న దృశ్యం

కోటవురట్ల, మే 10 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని శివారున్న గొల్లపేట గ్రామ అంగన్‌వాడీకేంద్రంలో శనివారం ప్రీ మదర్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల తల్లులను ఆహ్వానించి వారిని ఘనంగా సత్కరించారు. అంగన్‌వాడీ కార్యకర్త ఎస్. ఇస్తారురాణి మాట్లాడుతూ సమాజంలో తల్లిప్రేమను మించినది మరొకటి ఉండదని ఆమె కొనియాడారు. తల్లి ఎంత కష్టానైనా ఓర్చుకుంటూ పిల్లలను పోషిస్తుందన్నారు. ఆమె రుణం తీర్చుకోలేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో బాలింతలు, చిన్నారులు, గర్భిణులు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు

నక్కపల్లి, మే 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఉత్సవాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.ఉదయం ఆలయంలో ఉన్న స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

గ్యాస్ సిలిండర్ లీక్.. తప్పిన ప్రమాదం

హుకుంపేట మే 10 ఆంధ్రజ్యోతి; స్థానిక దాలిగుమ్మడి జంక్షన్ సమీపంలో జరిగిన శనివారం సంతలో టిఫిన్ షాపులోని గ్యాస్ సిలిండర్‌నుంచి శనివారం ఉదయం 11 సమయంలో మంటలు చెలరేగాయి. దీంతో సంతకు వచ్చిన వ్యాపారులు, జనాలు పరుగుతీశారు. దుకాణానికి సమీపంలోని ఓ ఇంటి మోటార్ బావినీటితో మంటలను అదుపుచేశారు. షాపులో వంట సామగ్రి, ఇతర సరకులు కాలిబూడిదయ్యాయి

గ్రామాల్లో చెత్త కుప్పలు.. జనాలకు తిప్పలు

» వీధులు, రహదారుల పక్కన పేరుకుపోతున్న వ్యర్థాలు

» పొంచి ఉన్న వ్యాధుల భయం » పట్టించుకోని పంచాయతీలు

ఎస్. రాయవరం, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలు చెత్త, ఇతర వ్యర్థాలతో అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. ఈ చెత్తను సకాలంలో తొలగించకపోవడంతో సమస్యగా మారుతోంది. కొన్నిచోట్ల ఎక్కడి చెత్తకు అక్కడే నిప్పుపెట్టి ప్రమాదకరంగా కాల్చి వేస్తుండడంతో పరిసర వాసులు ఇబ్బంది పడుతున్నారు. మరోవైపు స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర అంటూ అధికారులు ప్రచారం చేస్తుండంపై విమర్శలు వినిపిస్తున్నాయి. స్వచ్ఛాంధ్ర మండల అధికారులు ప్రచారానికే పరిమితం చేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నారు. సాక్షాత్తు మండల కేంద్రమైన ఎస్. రాయవరంలో పలు చోట్ల చెత్త పేరుకుపోయి దర్శనమిస్తోంది.



దర్మవరం అగ్రహారంలో చెత్తకు నిప్పు పెట్టడంతో వెలువడుతున్న పొగ



రాయవరం దళిత కాలనీ సమీపంలో ప్రధాన రహదారి పక్కన చెత్త కుప్ప

దళిత కాలనీ సమీపంలో సర్వసిద్ధి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారికి ఆనుకొని చెత్త పేరుకుని డంపింగ్‌యార్డును తలపిస్తోంది. దీంతో దుర్వాసన వెదజల్లుతుండటంతో ఈ మార్గంలో రాకపోకలు చేసే వాహన చోదకులు, స్థానిక ప్రజలు పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ధర్మవరం అగ్రహారంలో ప్రధాన రోడ్డు మార్గం పక్కనే చెత్తను నిప్పు పెట్టి కాల్చడంతో దానినుంచి వెలువడుతున్న పొగతో ఈ మార్గంతో పాటు పక్కనే ఉన్న జాతీయ రహదారిపై రాకపోకలు చేస్తున్న వాహన చోదకులు, స్థానికులు సమస్య ఎదుర్కొంటున్నారు. మండలంలోని పెదగుమ్ములూరు, జేవీపాలెం, గోకులపాడు, చినగుమ్ములూరు, సైతారుపేట, రేవుపోలవరం, బంగారమ్మపాలెం తదితర గ్రామాల్లో పారిశుధ్య పరిస్థితులు అధ్వానంగా మారాయి. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి పారిశుధ్యం కల్పనకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ప్రమాదకరంగా రోడ్డుపై మట్టి కుప్పలు



మంగవరం రోడ్డులో మట్టి కుప్ప

పాయకరావుపేట రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగవరం, పెదరాంభద్రపురం వెళ్లే ప్రధాన రహదారిలోని మట్టి కుప్పలు వాహనచోదకులకు ప్రమాదకరంగా మారాయి. గ్రామాల్లో తాగునీటి సౌకర్యార్థంలో భాగంగా ఈ ప్రధాన రోడ్డు పక్కన ఎక్సకవేటర్‌తో కాలువలను తీసి పైపులు వేసి మట్టితో కప్పి వేశారు. అయితే మంగవరం, పెదరాంభద్రపురం గ్రామాల సమీపంలో పైపులైను పనులతో టెలిఫోన్ నెట్‌వర్క్‌కు సంబంధించిన కేబుల్ తెగిపోవడంతో వాటి పనులకు సంబంధించి మట్టిని రోడ్డు సగం వరకు గుట్టగా వేసి వదిలేశారు. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళలో మట్టి దిబ్బలు కనిపించక ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ మార్గంలో మంగవరం, సత్యవరం, మాసాహెబ్‌పేట, గోపాలపట్నం, పెంటకోట, బంగారయ్యపేట తదితర గ్రామాలకు చెందిన ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. డెక్కన్ కెమికల్స్‌కు వెళ్లే రోడ్డు కావడంతో కంపెనీకి భారీ వాహనాలు వస్తుంటాయి. మట్టి కుట్టలు ఉన్న చోట మలుపులు ఉండడంతో మరింత ప్రమాదకరంగా మారాయి. వీటిని ఆర్అండ్‌బీ అధికారులు తొలగించాలని వాహన చోదకులు, ప్రజలు కోరుతున్నారు.

పంట మార్పిడితో అధిక దిగుబడులు

» మార్టేరు ఆర్ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త సహదేవ్ రెడ్డి



రైతులకు కూరగాయల విత్తనాలను అందజేస్తున్న శాస్త్రవేత్తలు

చింతపల్లి, మే 10 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ రైతులు వ్యవసాగులో పంట మార్పిడి చేయడంతో నాణ్యమైన అధిక దిగుబడులు పొందవచ్చునని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి. సహదేవ్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని రాజుపాకలు గ్రామంలో కేంద్ర ప్రభుత్వ ఏఐసీఆర్‌పీ సహకారంతో ఉద్యానశాఖ అధికారులు పంటమార్పిడిపై రైతుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రధాన శాస్త్రవేత్త మాట్లాడుతూ గిరిజనులు పొలాల్లో ఒకే రకం పంటను సాగు వల్ల ఆశించిన దిగుబడులు పొందలేకపోతున్నారన్నారు. వ్యవసాయ భూముల్లో రెండేళ్లకోసారి పసుపు, అల్లం, వరి, చిరుధాన్యాలు పంట మార్పిడి చేసుకుని సాగు చేయడంతో మంచి దిగుబడులు పొందవచ్చునన్నారు. అలాగే వ్యవసాయ అనుబంధ రంగాలపై రైతులు దృష్టి సారించాలన్నారు. పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లు, తేనె పెట్టెలు, పుట్టగొడుగుల పెంపకంతో అదనపు ఆదాయం పొందవచ్చునన్నారు. విజయనగరం ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె. తేజేశ్వరరావు మాట్లాడుతూ గిరిజన రైతులు పసుపు, అల్లం సాగు చేసే పంట పొలాల్లో అంతర పంటలుగా ఉద్యాన పంటలను సాగు చేసుకోవాలన్నారు. అనంతరం రైతులకు కూరగాయలు, మొక్కజొన్న విత్తనాలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో డివిజన్ ఉద్యానశాఖ అధికారి కంటా బాలకర్ణ పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు

» అల్లాడిపోతున్న ప్రజలు

» రోజు రోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు



ఎలమంచిలిలో ఎండను తట్టుకోలేక చీరకొంగు కప్పుకుని వెళుతున్న మహిళలు

అనకాపల్లి, మే 10 (ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్) : జిల్లాలో గత రెండు రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. పగటిపూట ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంట్లో నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నారు. దాదాపు అన్ని మండలాల్లో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గాలిలో తగ్గుతున్న తేమ, వేడి గాలుల వల్ల ఉక్కపోతతో జనం విలవిలలాడారు. మరో రెండు మూడు రోజులు పగటి పూట ఎండలు, రాత్రిపూట వాతావరణం చల్లబడి తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. జిల్లాలో శనివారం రావికమతంలో అత్యధికంగా 39.8 డిగ్రీలు, మాడుగులలో 39.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నర్సీపట్నం 38.8 డిగ్రీలు, సబ్బవరం 37.5, మునగపాక 38, అనకాపల్లి 37.8, దేవరాపల్లి 37.9, కె.కోటపాడు 37.9, కశింకోట 37.8, మాకవరపాలెం 37.8, గొలుగొండ 37.6, సబ్బవరం 37.5, నాతవరం 37.2, రోలుగుంట 37.1, బుచ్చెయ్యపేట 36.8, కోటవురట్ల 36.8, చోడవరం 36.8, చీడికాడ 36.3, పరవాడ 36.3, నక్కపల్లి 36.2, పాయకరావుపేట 35.3, ఎలమంచిలి 36, ఎస్.రాయవరం 35.5, రాంబిల్లి 35.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తాజా వాతావరణంతో పిల్లలు, వృద్ధుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. ఇప్పుడే పరిస్థితులు ఇలా ఉంటే మరికొద్ది రోజుల్లో అగ్ని కార్తెలు, ఆ తరువాత రోహిణి కార్తెలలో ఎలా ఉంటుందోనని పలువురు ఆందోళన చెందుతున్నారు.

అధిక లోడుతో వెళుతున్న క్వారీ లారీకి జరిమానా

కశింకోట, మే 10 (ఆంధ్ర జ్యోతి) : అధిక లోడుతో వెళుతున్న క్వారీ లారీకి జరిమానా విధించామని సీఐ అల్లు స్వామినాయుడు తెలిపారు. శనివారం సాధారణ తనిఖీలు నిర్వహించామన్నారు. ఇం తలో ఎలమంచిలి నుంచి కశింకోట వైపు క్వారీ రాయితో వస్తున్న లారీని ఆపి చూడగా, అందులో పరిమితికి మించి లోడు ఉన్నట్టు గుర్తించామన్నారు. వెంటనే వాహనాన్ని అదుపులోకి తీసుకుని ఆర్టీవోకు అప్పగించగా రూ.36వేలు జరిమానా విధించారన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను వాహనాల్లో తరలించినా, అధిక లోడుతో వెళుతున్నా అటువంటి వాహనాలపై చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

'ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి'

సబ్బవరం, మే 10 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం నుంచి జరగనున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తిచేసినట్టు కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ పి.సుభాషిణి, డీవో బి.రాధిక తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రథమ సంవత్సరం జనరల్, ఒకేషనల్ కలిపి 99 మంది, ద్వితీయ సంవత్సరం 34 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్టు చెప్పారు. పరీక్షా కేంద్రంలోని అన్ని గదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. కేంద్రం పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రతి రోజూ ఉదయం తొమ్మిది గంటల నుంచి పన్నెండు గంటల వరకు, ద్వితీయ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల ఉంటాయని చెప్పారు.

సంగీతంపై చిన్నారులకు శిక్షణ



కీబోర్డుపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న శ్రీనివాస్

అనకాపల్లి టౌన్, మే 10 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి కళ్యాణి అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో వేసవి సెలవుల్లో చిన్నారులకు వివిధ అంశాల్లో శిక్షణ ఇస్తుంది. సంగీతం, కూచిపూడి నాట్యం, వెస్ట్రన్ డ్యాన్స్ డ్రాయింగ్, పెయింటింగ్, కీబోర్డు, గిటార్ వంటి అంశాల్లో అనుభవజ్ఞులైన వారితో తర్ఫీదునిస్తున్నట్టు అకాడమీ కరస్పాండెంట్ లక్ష్మీశ్రీనివాస్ తెలిపారు. 160 మంది వరకు శిక్షణ పొందుతున్నారు. జూన్ పదో తేదీ వరకు ఈ తరగతులు కొనసాగుతాయని వివరించారు.

అప్పన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు

సింహాచలం, మే 10 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి భక్తులు శనివారం అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఉత్త రాంధ్ర జిల్లాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాలైన చత్తీస్‌ఘడ్, ఒడిశా సరిహద్దు గ్రామాల నుంచి కూడా తరలివచ్చారు. వేకువజామున సింహాచలం చేరుకుని అక్కడి నుంచి అటవీ ప్రాంతంలో కొలువుదీరిన భైరవస్వామిని దర్శించుకుని కొందరు మెట్ల మార్గంలోను, మరి కొందరు రోడ్డు మార్గంలోను సింహగిరికి చేరుకున్నారు. పవిత్ర గంగధారలో పుణ్యస్నానాలు ఆచరించి,అప్పన్నను దర్శించుకున్నారు. భక్తులు అధికంగా రావడంతో సింహగిరి మాడవీధుల్లో, గంగధార, కేశఖండనశాల, ప్రసాదాల విక్రయ కేంద్రాల వద్ద సందడి నెలకొంది. ఇదిలావుంటే, స్వామివారి నిత్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. తొలుత స్వామివారికి అర్చకులు విశేష పూజలు జరిపారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు

» స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు



హైదరాబాద్ ఆర్టీసీ బస్సులు ప్రారంభిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, మే 10 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఏపీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సూచించారు. నర్సీపట్నం ఆర్టీసీ డిపోలో శనివారం హైదరాబాద్, కాకినాడ వెళ్లే నూతన బస్సులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపో యాజమాన్యం ప్రయాణికులకు అందించాల్సిన సౌకర్యాలపై తమ వంతు బాధ్యత వహించాలన్నారు. కాకినాడ, హైదరాబాద్‌లకు రెండో సర్వీసు ప్రారంభించడం ప్రయాణికులకు మరింత సౌకర్యంగా ఉంటుందన్నారు. ప్రతి నెలా అద్దె బస్సుల ద్వారా వచ్చే ఆదాయంతో డిపోలో అభివృద్ధి పనులు చేపట్టాలని ఆయన సూచించారు. అనంతరం డిపోలో సౌకర్యాలను పరిశీలించి మరుగుదొడ్ల నిర్వహణ, డిపో భవనాలకు రంగులు వెలిపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తక్షణమే ఈ పనులు చేపట్టాలని డిపో సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

నిర్మాణం చేపట్టి నెల.. అంతలోనే ఇలా..

» వాహనాల వేగానికి కళ్లెం వేసేందుకు విజయరామరాజుపేట సమీపంలో రైల్వే శాఖ చర్యలు

» మూడు లైన్లలో స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు » ప్రస్తుతం నామరూపాల్లేకుండా మారడంపై విస్మయం



విజయరామరాజుపేట సమీపంలో స్పీడ్ బ్రేకర్ల దుస్థితి

అనకాపల్లి టౌన్, మే 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని విజయరామరాజుపేట అండర్ బ్రిడ్జి కింద నుంచి అతివేగంగా వెళ్లే వాహనాల వేగానికి కళ్లెం వేసేందుకు రైల్వే శాఖ అధికారులు ఇరువైపులా వేసిన స్పీడ్ బ్రేకర్లు మూన్నాళ్ళ ముచ్చటగా మారాయి. నెల రోజుల క్రితం ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లు ఒక పక్క పూర్తిగా దెబ్బతినగా, మరో పక్క స్వల్పంగా పాడయ్యాయి. మార్చి 17వ తేదీ వేకువజామున భారీ రాళ్ల లోడుతో వెళ్తున్న టిప్పర్ లారీ రైల్వే గడ్డర్‌ను ఢీకొని ట్రాక్ ఒంపునకు గురైంది. దీంతో అప్పట్లోనే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని సంఘటనా స్థలాన్ని పరిశీలించిన కూటమి నాయకులు అధికారులను కోరారు. దీంతో రైల్వే ఇంజనీరింగ్ అధికారులు అండర్ బ్రిడ్జికి ఇరువైపులా మూడు లైన్లలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. దీనివల్ల వాహనచోదకులు, ఆటోలో వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని మూడు లైన్లకు బదులు ఒక లైన్‌తో సరిపెడితే బాగుంటుందని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ కొణతాల హరనాథబాబు రైల్వే ఎస్ఎం సచ్చినివాస్ దృష్టికి తీసుకెళ్లారు. ఒకసారి వేసిన తరువాత తీసేందుకు అవకాశం ఉండదని ఆయన స్పష్టం చేశారు.

ఇదిలావుంటే, నెల రోజులుగా అండర్ బ్రిడ్జికి ఇరువైపులా స్పీడ్ బ్రేకర్లు దెబ్బతింటూ వస్తున్నాయి. అయితే, ఇవి వాటంతటా అవే పాడవుతున్నాయా.. లేక ఎవరైనా తొలగిస్తున్నారా.. అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఈ విషయాన్ని ఎస్ఎం సచ్చినివాస్ వద్ద ప్రస్తావించగా, స్పీడ్ బ్రేకర్లు దెబ్బతిన్న విషయం తన దృష్టికి రాలేదన్నారు. ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడతానని చెప్పారు.



నాయుళ్లవీధి జంక్షన్‌లో దెబ్బతిన్న స్పీడ్ బ్రేకర్లు

భారత సైన్యానికి బాసటగా పూజలు



బంగారయ్యపేట శివాలయంలో పూజలు చేస్తున్న బీజేపీ నాయకులు

కశింకోట, మే 10 (ఆంధ్రజ్యోతి) : భారత్- పాక్ యుద్ధంలో భారత్ త్రివిధ దళాలకు విజయం చేకూరాలని కోరుతూ మేజర్ పంచాయతీ తాళ్లపాలెం శివారు బంగారయ్యపేట శివాలయంలో బీజేపీ నాయకులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాని నరేంద్రమోదీ పాలనలో దేశప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని, త్రివిధ దళాలు పాకిస్తాన్‌పై యుద్ధంలో విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పొన్నగంటి అప్పారావు, అప్పికొండ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



సైనికులకు సంఘీభావం ప్రకటిస్తున్న న్యాయ వర్సిటీ వీసీ, తదితరులు

డీఎస్ఎన్ఎల్‌యూ సంఘీభావం

సబ్బవరం : ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాక్‌తో తలపడుతున్న భారత సైన్యానికి సబ్బవరంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు శనివారం సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ సూర్యప్రకాశరావు మాట్లాడుతూ ఇంత కాలం సహనాన్ని పాటించిన సైన్యం పాక్ కవ్వింపు చర్యలతో యుద్ధానికి దిగక తప్పలేదన్నారు. ఈ సమయంలో జాతి యావత్తు భారత సైన్యానికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మురళీనాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

వీరజవాన్ మురళీనాయక్‌కు అంజలి

అనకాపల్లి టౌన్, మే 10 (ఆంధ్రజ్యోతి) : భారత్- పాకిస్తాన్ మధ్య జరుగుతున్న యుద్ధంలో ఉగ్రవాదులను అంతమొందించడంలో భాగంగా వీరమరణం పొందిన తెలుగు జవాన్ మురళీనాయక్‌కు శనివారం ఇక్కడ పాత్రికేయులు నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో పి.సత్యనారాయణ, గోపాల్, మధుబాబు, అప్పారావు, సాయిరాం, గ్రామీణ వైద్యుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆడారి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఇదిలావుంటే, పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో తెలుగుబిడ్డ మురళీనాయక్ వీరమరణం పొందడం కలచివేసిందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

» వామపక్షాల నాయకులు డిమాండ్

» 20న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మె విజయవంతానికి పిలుపు



పరవాడ ఫార్మాసిటీలో కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న గనిశెట్టి

పరవాడ, మే 10 (ఆంధ్రజ్యోతి) : లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20వ తేదీన చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను అంతా విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. శనివారం ఇక్కడి ఫార్మాసిటీలో కార్మికులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్స్ కింద మార్పు చేసి పరిశ్రమల యాజమాన్యాలకు మేలు చేకూర్చేలా వ్యవహరించడం దారుణమన్నారు. ఆ చర్యలను నిరసిస్తూ చేపడుతున్న సమ్మెలో కార్మిక, రైతు సంఘాలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.రమణ, జి.చిట్టిబాబు, సత్తిబాబు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



కశింకోటలో సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ ప్రతినిధులు

కశింకోట : లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ ఈనెల 20న చేపట్టనున్న సమ్మెను అంతా విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన పోస్టర్ ఇక్కడ ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు తునూజ, రమాదేవి, నాగమణి, నారాయణమ్మ, సత్యవతి, అమ్మాజీ, లక్ష్మి, నూకరత్నం తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : కార్మికులకు నష్టం కలిగించే చట్టాలను రద్దు చేయాలని సీపీఎం మండల నాయకురాలు ఉప్పాడ సత్యవతి డిమాండ్ చేశారు. శనివారం ఇక్కడ పంచాయతీ వర్కర్లతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 20న దేశవ్యాప్తంగా చేపట్టనున్న సమ్మెను అంతా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

గుంతలమయం.. ప్రయాణాలు భయం..

» అధ్వానంగా సింహాద్రి ఎన్టీపీసీ ప్రధాన రహదారి

» పట్టించుకోని అధికారులు

» ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



ఊటగెడ్డ కూడలి నుంచి సింహాద్రి ఎన్టీపీసీకి వెళ్లే ప్రధాన రహదారి దుస్థితి



బంగ్లా జంక్షన్ వద్ద ధ్వంసమైన రహదారి

పరవాడ, మే 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన పరవాడ ఊటగెడ్డ కూడలి నుంచి సింహాద్రి ఎన్టీపీసీకి వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో పలుచోట్ల పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వీటి కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారికి మరమ్మతులు చేపట్టి ఏడాది కాకముందే గుంతలు ఏర్పడడంపై వాహనచోదకులు మండిపడుతున్నారు. ఈ రహదారి గుండా సింహాద్రి ఎన్టీపీసీకి చెందిన కార్మికులు, ఉద్యోగులతో పాటు వాడ చీపురుపల్లి, నాయుడుపాలెం, ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం, నునపర్తి, తంతడి పంచాయతీలకు చెందిన ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ క్రమంలో రహదారిపై ఏర్పడిన గుంతలతో ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో ఈ రహదారి గుండా ప్రయాణించాలంటేనే హడలిపోతున్నారు. పరిమితికి మించి బొగ్గు లోడుతో ప్రయాణిస్తున్న లారీలు కూడా ఇదే రహదారిపై రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో గుంతలు మరింత పెద్దవిగా మారి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఇక్కడ ఆదమరిచి ప్రయాణిస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సిందే. ఆర్అండ్‌బీ శాఖ అధికారులు తక్షణమే స్పందించి రహదారి పై ఏర్పడిన గుంతలను పూడ్చి వేసేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

బంగ్లా కూడలి వద్ద ...

ఇదిలావుంటే, పరవాడ బంగ్లా జంక్షన్‌లో రహదారిపై పరిస్థితి ఇలాగే ఉంది. రోడ్డుపై పడిన గుంతల కారణంగా అటుగా రాకపోకలు సాగించే వారంతా ఇబ్బందులు పడుతున్నారు. ఈ జంక్షన్ మీదుగా గాజువాక, సింధియా, విశాఖపట్నం, అచ్యుతాపురం, ఫార్మాసిటీ తదితర ప్రాంతాలకు విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు, సాధారణ ప్రయాణికులతో పాటు పరిశ్రమలకు యంత్ర సామగ్రిని తరలించే భారీ వాహనాలు నిత్యం వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. కూడలి వద్ద ఏర్పడిన గోతుల కారణంగా పరిస్థితి దారుణంగా తయారైంది. నాలుగు నెలల క్రితమే ఈ కూడలిలో రహదారికి మరమ్మతులు చేపట్టారు. ఇంతలోనే భారీ గుంతలు ఏర్పడడంతో ఆర్అండ్‌బీ శాఖ అధికారుల తీరుపై మండిపడుతున్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లనే మూన్నాళ్లకు రహదారి దుస్థితి మొదటికి వస్తోందని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మరమ్మతు చర్యలు పక్కాగా చేపట్టాలని అంతా కోరుతున్నారు.

డీఎస్సీకి ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ

» బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులకు అవకాశం

అనకాపల్లి రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం నిర్వహించనున్న మెగా డీఎస్సీ-2025కి హాజరయ్యే బీసీ, ఎస్సీ ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్టు వెనుకబడిన తరగతుల సంక్షేమం, సాధికారత అధికారి కె.రాజేశ్వరి తెలిపారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సంచాలకుల ఆదేశాల మేరకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్‌కు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్న ఆమె పేర్కొన్నారు. టెట్ అర్హత సాధించిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని స్పష్టం చేశారు. అభ్యర్థులు తమ సొంత జిల్లాలోనే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తుతోపాటు కుల ధ్రువీకరణ పత్రం, నేటివిటీ సర్టిఫికెట్, ఆదాయ ధ్రువపత్రం, టెట్‌లో అర్హత సాధించినట్టు సర్టిఫికెట్‌ను జత చేయాలని పేర్కొన్నారు. దరఖాస్తులను అనకాపల్లిలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయంలో అందజేయాలని, మరిన్ని వివరా కోసం 98858 45743, 94949 78777 నంబర్లకు ఫోన్ చేసి సంప్రదించవలసిందిగా ఆమె కోరారు.

పరవాడ ఎంపీడీవోగా రమేష్‌నాయుడు



రమేష్‌నాయుడు

పరవాడ, మే 10 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా బి.రమేష్‌నాయుడు శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈయన కొయ్యూరు ఎంపీడీవోగా పనిచేసి సెలవులో ఉన్నారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన ఎస్‌డీ శ్యామ్‌సుందర్ కలెక్టర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో దురుసు ప్రవర్తన, పొంతన లేని సమాధానాలు చెప్పడంతో ఈ ఏడాది జనవరి 30న సస్పెండ్ అయిన సంగతి తెలిసిందే. దీంతో ప్రభుత్వం పంచాయతీ విస్తరణాధికారిగా పనిచేస్తున్న ఎస్.ధర్మారావుకు ఇన్‌చార్జి ఎంపీడీవో బాధ్యతలు అప్పగించింది. రమేష్‌నాయుడు సెలవులు పూర్తికావడంతో ఇక్కడ నియమించింది.

'విశాఖ డెయిరీ పెంచిన పాల ధరను తగ్గించాలి'

అనకాపల్లి టౌన్/తుమ్మపాల, మే 10 (ఆంధ్రజ్యోతి) : విశాఖ డెయిరీ యాజమాన్యం పెంచిన పాల ధరను ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు శనివారం వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు. డెయిరీకి పాలు పోస్తున్న రైతులకు చెల్లించాల్సిన ఆవు పాల ధరను గతంలో తగ్గించిన యాజమాన్యం, వినియోగదారుడికి విక్రయించే లీటరు పాలపై రెండు రూపాయలు పెంచడం ఏమిటని వారు ప్రశ్నించారు. కూటమి నాయకులు తక్షణమే జోక్యం చేసుకొని పెంచిన ధరను తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. లీటరు పాల సేకరణ ధరకు, వినియోగదారులకు అమ్ముతున్న ధరకు వ్యత్యాసం ఇరవై రూపాయల వరకు ఉందని వివరించారు.

సబ్‌స్టేషన్ కూడలిలో బస్ షెల్టర్ లేక ఇబ్బందులు



ఎండలో వేచి ఉన్న విద్యార్థులు, ప్రయాణికులు

పరవాడ, మే 10 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి సబ్‌స్టేషన్ కూడలిలో బస్ షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ఇక్కడి నుంచి గాజువాక, విశాఖపట్నం, ఫార్మాసిటీ, సింహాద్రి ఎన్టీపీసీ, అచ్యుతాపురం, ఎలమంచిలి తదితర ప్రాంతాలకు కార్మికులు, ఉద్యోగులు, విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడ షెల్టర్ లేకపోవడంతో బస్సులు, ఇతర ప్రైవేటు వాహనాలు వచ్చే వరకు ఎండలో వేచి ఉండాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి ఇక్కడ బస్ షెల్టర్ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాల్సిందిగా అంతా కోరుతున్నారు.

పాడేరుకు పండగ కళ


ప్రధాన కూడలిలో విద్యుత్ దీపాలతో స్వాగత ద్వారాలు

- ఆలయానికి ముస్తాబు
- విద్యుత్ దీపాల అలంకరణలో వీధులు

మోదకొండమ్మ ఉత్సవాలు పురస్కరించుకుని పాడేరు పట్టణంలో ప్రత్యేక శోభ నెలకొంది. రంగులతో ఆలయం ముస్తాబు చేశారు. పలు ప్రాంతాలు విద్యుత్ దీపాలతో వెలుగొందుతున్నాయి. భక్తులకు అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేశారు.
- పాడేరు, ఆంధ్రజ్యోతి


రంగుల్లో మోదకొండమ్మ ఆలయం


పాడేరు మెయిన్‌రోడ్డుపై పందిరి లైటింగ్


శిథిలమైన గుమ్మలోని అంగన్‌వాడీ కేంద్రం


ఓ ఇంట్లో చిన్నారులకు బోధిస్తున్న కార్యకర్త

అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం కరవు

- గుమ్మ పంచాయతీ కేంద్రంలో ఓ ఇంటి ఇరుకు గదిలో నిర్వహణ
- చిన్నారులు, గర్భిణులకు అగచాట్లు

అనంతగిరి, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల గుమ్మ పంచాయతీ కేంద్రంలో అంగన్‌వాడీ కేంద్రానికి సొంతగూడు కరువైంది.. ఎన్నోఏళ్ల క్రితం నిర్మించిన భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది.. దీంతో రెండేళ్లక్రితం పూర్తిగా పడిపోయే స్థితికి చేరుకోవడంతో చిన్నారులు భద్రతదృష్టిలో పెట్టుకుని, ఐసీడీఎస్ పీవో సంతోషికుమారి ఆదేశాలతో.. ఓ ఇంటి వద్దకు ఈ కేంద్రాన్ని మార్పు చేశారు. ఈస్థితతిలో శాశ్వత భవనం లేక చిన్నారులు, బాలింతలు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ కేంద్రంలో ప్రీ స్కూల్ 12 మంది పిల్లలు, చిన్నారులు 11 మంది, బాలింతలు 2, గర్భిణి ఒకరికి సేవలందిస్తున్నారు. చిన్నారులకు ఆటస్థలం, కనీస సౌకర్యాలు లేకపోవడంపై తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. కూటమి ప్రభుత్వంలోనైనా భవనానికి నిధులు మంజూరు చేయాలని, చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఘనంగా మదర్స్ డే


మదర్స్ డే శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

కొయ్యూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): పిల్లలపై తల్లుల ప్రేమ కొలవలేనిదని సీడీపీవో విజయకుమారి సూచించారు. కొయ్యూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధి అంగన్‌వాడీ కేంద్రాలలో మదర్స్‌డే ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతీ కేంద్రంలో ప్రీ స్కూలు పిల్లలతో తల్లులకు పుష్పగుచ్ఛాలతో ఆహ్వానించి వారికి పాదాలకు నమస్కరింప జేసే కార్య క్రమం చేపట్టారు. అనంతరం విద్యార్థులచే తల్లుల చిత్రపటాలను వేసేలా చూసి వాటికి రంగులు అద్దింప చేశారు. అనంతరం కిశోర వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కేంద్రాలను సందర్శించిన సీడీపీవో తల్లులు పిల్లల పురోభివృద్ధికి తీసుకోవాల్సిన అంశాలను వివరించారు. ఈ కార్యక్రమాలలో సూపర్‌వైజర్లు, మహిళ పోలీసులు, డ్వామా నుంచి విచ్చేసిన అధికారి రాజన్నదొర తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి బోర్లు ఏర్పాటు


సీలేరు సీపీహెచ్ క్యాంప్‌లో బోరు తవ్వకం పనులను ప్రారంభిస్తున్న గ్రామ పెద్దలు

సీలేరు, మే 10 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం సీలేరులో తాగునీటి సమస్య అధికంగా ఉన్న ప్రాంతాల్లో పంచాయతీ జనరల్ ఫండ్స్ నుంచి బో ర్లు వేసేందుకు చర్యలు చేపడుతున్నట్టు సర్పంచ్ పి. దుర్గో తెలిపారు. ప్రధానంగా అల్లూరి వీధి, సీపీ హెచ్ క్యాంప్, కన్నబ్బాయి క్యాంప్ మూడు చోట్ల నీటి సమస్య అధికంగా ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ మేరకు శనివారం స్థా నిక సీపీహెచ్ క్యాంప్‌లో మొదటి బోరు పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ సభ్యులు పిల్లా సాంబ మూర్తి, వైస్ సర్పంచ్ కె. వల్లీప్రసాద్, డీసీసీ కార్యదర్శి కారే శ్రీనివాస్, వైసీపీ నాయకుడు బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

గోమంగిలో తాగునీటి సమస్య పరిష్కరించాలి


ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ,డీఈఈలకు వినతి ఇస్తున్న పెదబయలు జడ్పీటీసీ సభ్యుడు, గ్రామస్థులు

పెదబయలు, మే 10 (ఆంధ్రజ్యోతి): గోమంగి పంచాయతీ కేంద్రంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని జడ్పీటీసీ సభ్యుడు బొంజుబాబు, గ్రామస్థులు కోరారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలో గల ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ జవహర్‌కుమార్, డీఈఈ గోపాలకృష్ణలను కలిసి వినతి పత్రాలను అందించారు. తాగునీరులేక గ్రామస్థులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారన్నారు.తక్షణమే సమస్యను పరిష్కరించాలని కోరారు. అధికారులు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థుడు కొమ్మ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

అటవీ సంపద సంరక్షణకు ప్రత్యేక చర్యలు

- డీఆర్‌వో వెంకటరాజు

చింతపల్లి, మే 10 (ఆంధ్రజ్యోతి): అటవీ సంపద సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు స్థానిక డీఆర్వో డి. వెంకటరాజు అన్నారు. శనివారం రాత్రి హనుమాన్ జంక్షన్‌లో అటవీశాఖ అధికారులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ రేంజ్ అధికారి బి. అప్పారావు పర్యవేక్షణలో తనిఖీలను విస్తృతం చేశామన్నారు. ప్రధానంగా టేక్ ప్లాంటేషన్లు, రంగురాళ్ల క్వారీలపై నిఘా పెట్టామన్నారు. సిగినాపల్లి, గుర్రాళ్లగొంది, దొడ్డిగొంది క్వారీల్లో రంగురాళ్లు తవ్వకాలు జరగకుండగా బేస్ క్యాంప్, స్ట్రైకింగ్ ఫోర్సు సిబ్బందితో గస్తీ నిర్వహిస్తున్నామన్నారు. టేకు ప్లాంటేషన్‌లోనూ అదనపు సిబ్బందిని నియమించినట్టు చెప్పారు. రంగురాళ్ల క్వారీలు, టేకు ప్లాంటేషన్ వద్ద అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామన్నారు. అటవీ సంపద, వన్యప్రాణులు సంరక్షణకు ప్రజలు సహకరించాలన్నారు. ఈకార్యక్రమలో అటవీశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్ విజయవంతానికి పూజలు


మోదకొండమ్మకు పూజలు చేస్తున్న బీజేపీ నాయకులు

పాడేరురూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): దేశ సరిహద్దులో ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని కోరు తూ మోదకొండమ్మ ఆలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు మఠం శాంతకుమారి ఆధ్వర్యంలో నాయకులు శనివారం ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పహల్గాంలో అ మాయక పర్యాటకులను పాకిస్తాన్ ఉగ్రవాదులు చంపడమే కాకుండా ప్రధాని మోదీకి చెప్పుకోవాలని హెచ్చరించారన్నారు. ఈ నేపథ్యంలో భారత త్రివిధ దళాలు పాకిస్తాన్‌పై ప్రతి దాడి ప్రారంభించాయన్నారు. ఈ యుద్ధం విజయవంతం కావాలని మోదకొండమ్మకు ప్రత్యేక పూజలు చేపట్టామన్నారు. మృతి చెందిన వీర జవాన్‌లకు ఘన నివాళి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కె. కృష్ణారావు, పి.రాజారావు, వేమనబాబు, సల్లా రామకృష్ణ, గోపాలపాత్రుడు, సత్యవతి, శ్రీలక్ష్మీ, కళావతి, పాపిటిరాజు, రవిచంద్ర పాల్గొన్నారు.

బౌద్ధ సంప్రదాయ రీతిలో అన్నదమ్ముల వివాహం


వివాహ వేడుక నిర్వహిస్తున్న బుద్దిస్టు సొసైటీ ప్రతినిధులు

పెదబయలు, మే 10 (ఆంధ్రజ్యోతి): బౌద్ధ సంప్రదాయరీతిలో అన్నదమ్ముల కు వివాహం జరిగింది. వివరాలివి.. మండంలోని మూరుమూల కొరవంగి గ్రామంలోని కొమరం భీమ్ కాలనీకి చెందిన ఉపాధ్యాయుడు సలబంగి కోటేశ్వరరావు (బుద్ధిస్టు సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు) తొలుతనుంచి అంబేడ్కర్, పూలే, బుద్ధుని ఆశయాలకు అనుగుణంగా నడుస్తున్నారు. ఈ నేపథ్యంలో తన ఇద్దరు తమ్ముళ్లు సలబంగి చిన్నారావు శ్యామంతి, సునీల్ కుమార్, ఝాన్సీ కుమారిలతో పూల దండల మార్పి నిరాడంబరంగా పెళ్లి చేశారు. ఈ పెళ్లిని బ్రాహ్మణ పూజారీతో కాకుండా బుద్ధిస్టు సొసైటీ వారి ఆధ్వర్యంలో ఈ వివాహం జరిపారు. ఈ కార్యక్రమంలో బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండి యా రాష్ట్ర ప్రధాన కారదర్శి వి.వి. దుర్గారావు, సత్యనారాయణ, ఎస్ . సింహాద్రి ఆధ్వర్యంలో వివాహ సర్టిఫికెట్లను అందించారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఎస్‌వీ విశాఖ పట్నం అధ్యక్షుడు గౌతమ్‌బాబు, మాజీ ఎమ్మెల్యే లకే రాజారావు, బీఎస్ఐ విశాఖ కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కేంద్ర కార్యాలయం గ్రీవెన్స్‌లో జీసీసీ ఛైర్మన్


మంగళగిరిలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌లో సమస్యలు వింటున్న శ్రావణ్‌మార్

పాడేరు, మే 10 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో అరకులోయ పార్లమెంటరీ అధ్యక్షుడు, జీసీసీ ఛైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు. ఈసందర్భంగా వివిధ సమస్యలపై వచ్చిన వారి నుంచి అర్జీలను స్వీకరించి, వారి సాదక బాధలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంతో టీడీపీ నిర్వహిస్తున్న ఈ గ్రీవెన్స్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్య క్రమంలో తనను భాగస్వామ్యం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

లేటరైట్ తవ్వకాలను అడ్డుకుంటాం: బీసీవై


నుర్మతిలో ప్రాంతంలో నినాదాలు చేస్తున్న బీసీవై నాయకులు

జి.మాడుగుల, మే 10 (ఆంధ్ర జ్యోతి): మండలపరిధి నుర్మతి ప్రాంతంలో లేటరైట్ తవ్వకాలపై అనుమతుల ఇస్తే సహించేదిలేదని బీసీవై పార్టీ నియోజక వర్గ ఇన్ చార్జి కిల్లో రాజన్ హెచ్చరించారు. ఈ మేరకు శనివారం ఆయన నుర్మతిలో నిక్షిప్తమై ఉన్న లేటరైట్ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ,బినామీల పేరుతో మన్యంలో మైనింగ్ మాఫియా 1/70 చట్టానికి తూట్లు పొడుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా నుర్మతి ప్రాంతంలోని లేటరైట్ అనుమతులకోసం సంతకాలు సేకరించినట్టు తెలుస్తోందన్నారు. దీనికి స్థానిక నాయకులు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. ఇదే జరిగితే పార్టీ తరఫున న్యాయ పోరాటానికి దిగుతామని రాజన్ హెచ్చరించారు. గిరిజనులకు మభ్యపెట్టి బలవంతపు తీర్మానాలు చేయడం నాయకులకు తగదని విమర్శించారు. జీకే వీధి మండల చాపరాతి పాలెం, నుర్మతి లేటరైట్ తవ్వకాల ప్రయత్నాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కా ర్యక్రమంలో పెసా కమిటీ సభ్యులు వి.బాలన్న, జనసేన మండల నాయకుడు టి.వెంకటరమణ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు టి.బ్రహ్మాలింగం, సాంబ, గణేశ్ పాల్గొన్నారు.

టెన్త్ తప్పిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

- ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి


విద్యార్థినుల భోజనాలను పరిశీలిస్తున్న ఏటీడబ్ల్యూవో, ఎంఈవో

చింతపల్లి, మే 10 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి తప్పిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్టు స్థానిక ఏటీడబ్ల్యూవో జయ నాగలక్ష్మి అన్నారు. శనివారం స్థానిక బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధపడుతున్న విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను ఎంఈవో వీబీవీవీవీ ప్రసాద్‌తో కలిసి ఏటీడబ్ల్యూవో తనిఖీ చేశారు. తరగతుల నిర్వాహణ, భోజనాలను ఆమె స్వయంగా పరిశీలించారు. ఈసందర్భంగా ఏటీడబ్ల్యూవో మాట్లాడుతూ చింతపల్లి మండలంలో వివిధ ఆశ్రమ, జిల్లా పరిషత్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి ఫెయిలైన విద్యార్థులు 233మందికి బాలుర-2లో పాఠశాలలో, 217మంది విద్యార్థినులకు బాలికల ఆశ్రమ పాఠశాలలో, జీకేవీధి మండల కేంద్రంలోని 281మంది విద్యార్థినులకు బాలికల ఆశ్రమ పాఠశాల, 163మంది విద్యార్థులకు బాలుర ఆశ్రమ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పాఠశాలకు వచ్చి తరగతులను బోధిస్తున్నారన్నారు. రోజు ఇద్దరు ఉపాధ్యాయులు విద్యార్థులకు అందుబాటులో ఉంటున్నారన్నారు. ఈనెల 19 నుంచి 28 వరకు జరిగే పరీక్షలు విద్యార్థులు వసతి గృహాల్లో ఉంటూ రాస్తారన్నారు. విద్యార్థులంతా ఉత్తీర్ణులయ్యేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారన్నారు. ఈ తరగతులను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జేఏ కొండలరావు, హెచ్‌డబ్ల్యూవో నూకరత్నం పాల్గొన్నారు.

'ఇంటర్ పరీక్షలకు సకాలంలో హాజరు కావాలి'

పాడేరురూరల్, మే 10(ఆంధ్రజ్యోతి):పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 12వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలకు విద్యార్థులు సకాలంలో హాజరు కావాలని ప్రిన్సిపాల్ శరగడం శ్రీనివాసరావు సూచించారు. పాడేరులో 11వ తేదీనుంచి 13 వరకు మోదకొండమ్మ ఉత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో పోలీసులు ట్రాఫిక్ నిబంధనలు అమలు చేస్తున్నందున ముందుగానే బయలుదేరి పరీక్ష కేంద్రానికి వచ్చేలా సిద్ధం కావాలన్నారు. మార్గ మధ్యలో పరీక్ష హాల్ టిక్కెట్‌ను పోలీస్ అధికారులు లేదా ఉత్సవ కమిటీ ప్రతినిధులకు చూపించాలన్నారు.

గ్యాస్ సిలిండర్ లీక్.. తప్పిన ప్రమాదం

హుకుంపేట మే 10 ఆంధ్రజ్యోతి; స్థానిక దాలిగుమ్మడి జంక్షన్ సమీపంలో జరిగిన శనివారం సంతలో టిఫిన్ షాపులోని గ్యాస్ సిలిండర్‌నుంచి శనివారం ఉదయం 11 సమయంలో మంటలు చెలరేగాయి. దీంతో సంతకు వచ్చిన వ్యాపారులు, జనాలు పరుగుతీశారు. దుకాణానికి సమీపంలోని ఓ ఇంటి మోటార్ బావినీటితో మంటలను అదుపుచేశారు. షాపులో వంట సామగ్రి, ఇతర సరకులు కాలిబూడిదయ్యాయి.

ముంచంగిపుట్టు సంత ఆశీల వేలం రేపు

ముంచంగిపుట్టు, మే 10 (ఆంధ్రజ్యోతి) : ముంచంగిపుట్టు వారపు సంతలో ఆశీల వసూల వేలం ఈ నెల 12న నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వి.సూర్యనారాయణ మూర్తి తెలిపారు. మండల పరిషత్ కార్యాయలంలో వేలం పాట కొనసాగుతుందన్నారు. పాట లో పాల్గొనే వారు రూ.10వేలు డిపాజిట్ చేయాలన్నారు.

అశ్రునయనాలతో మావోయిస్టు నేత పండన్నకు వీడ్కోలు


పండన్న అంతిమ యాత్రలో పలు సంఘాల నేతలు, అభిమానులు

సీలేరు, మే 10 , (ఆంధ్రజ్యోతి) : మావోయిస్టు కీలక నేత, ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు కాకూరి పండన్న అలియాస్ జగన్ అంత్యక్రియలు శనివారం తన స్వగ్రామమైన జీకేవీధి మండలం దుప్పులవాడ పంచాయతీ కొమ్ములవాడలో అభిమానుల అశ్రునయనాల మధ్య ఘనంగా జరిగాయి. జగన్ వై. రామవరం, కొయ్యూరు మండలాల సరిహద్దుల్లోని శేషరాయి అటవీప్రాంతంలో పోలీసులకు మావోయిస్టులకు మధ్య గత బుధవారం జరిగిన ఎదురు కాల్పుల్లో మృతి చెందిన సంఘటన తెలిసిందే. పోలీసులు జగన్ మృతదేహాన్ని రంపచోడవం ఆసుపత్రికి తరలించి అక్కడ శుక్రవారం రాత్రి పోస్టుమార్టం నిర్వహించి వారి బంధువులకు అప్పగించారు. ఈ మృతదేహం శనివారం తెల్లవారుజామున అంబులెన్సులో కొమ్ములవాడ తరలించారు. 30 ఏళ్ల పాటు మావోయిస్టు ఉద్యమమే ఊపిరిగా కొనసాగిన జగన్‌ను కడసారిగా చూసేందుకు ఆయనతో కలసి పని చేసిన మాజీ మావోయిస్టులు, అభిమానులు, బంధువులు, వివిధ గ్రామాల గిరిజనులు వందలాది మంది వచ్చి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. మృత దేహం వద్ద అమర్ రహే అమర్‌రహే జగన్, నీ త్యాగాలు వృథా కావంటూ నినాదాలు చేస్తూ నివాళులర్పించారు. అనంతరం అం తిమయాత్రను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మావోయిస్టులు, కుటుంబ సభ్యులు మాట్లాడుతూ జగన్ మృత దేహాన్ని రంపచోడవరం ఆసుపత్రి సిబ్బంది, వైద్యులు భద్రపర్చడంలో పూర్తిగా విఫలమయ్యారని, రోజుల తరబడి జాప్యంతో మృతదేహం పురుగులు పట్టినట్టు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యులు జాంబ్రీ అలియాస్ పిల్లి వెంకటేశ్వరులు, చెడ్డా భూషణం అలియాస్ కాత్రో అలియాస్ గాసీ, మాజీ అమరవీరుల బంధుమిత్రుల రాష్ట్ర కమిటీ సభ్యుడు, రక్త బంధు ఆదివాసీ హక్కుల సంఘం సభ్యుడు, దామోదర్ తిలక్, కోరుకొండ మాజీ కమాండర్ శేఖర్, మహిళా మావోయిస్టులు మాజీ జననాట్యమండలి కమాండర్ సీత, మాజీ డిప్యూటీ కమాండర్‌లు సంధ్య, వసంత, కుమారీ, మాజీ దళ సభ్యురాలు సరోజ, అనకాపల్లి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మీసాల సుబ్బన్న, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సుంకర విష్ణుమూర్తి, దుప్పులవాడ, గాలికొండ సర్పంచ్‌లు కేలేబు కుమారీ, బుజ్జిబాబు, గుమ్మిరేవుల మాజీ సర్పంచ్ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

పంట మార్పిడితో అధిక దిగుబడులు

- మార్టేరు ఆర్ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవ్ రెడ్డి


రైతులకు కూరగాయల విత్తనాలను అందజేస్తున్న శాస్త్రవేత్తలు, ఉద్యానశాఖ అధికారి

చింతపల్లి, మే 10 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ రైతులు వ్యవసాగులో పంట మార్పిడి చేయడంతో నాణ్యమైన అధిక దిగుబడులు పొందవచ్చునని మా ర్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి. సహదేవ్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని రాజుపాకలు గ్రామంలో కేంద్ర ప్రభుత్వ ఏఐసీఆర్‌పీ సహకారంతో ఉద్యానశాఖ అధికారులు పంటమార్పిడిపై రైతుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రధాన శాస్త్రవేత్త మాట్లాడుతూ గిరిజనులు పొలాల్లో ఒకే రకం పంటను సాగు వల్ల ఆశించిన దిగుబడులు పొందలేకపోతున్నారన్నారు. వ్యవసాయ భూముల్లో రెండేళ్లకోసారి పసుపు, అల్లం, వరి, చిరుధాన్యాలు పంట మార్పిడి చేసుకుని సాగు చేయడంతో మంచి దిగుబడులు పొందవచ్చునన్నారు. అలాగే వ్యవ సాయ అనుబంధ రంగాలపై రైతులు దృష్టి సారించాలన్నారు. పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లు, తేనె పెట్టెలు, పుట్టగొడుగుల పెంపకంతో అదనపు ఆదాయం పొందవచ్చునన్నారు. విజయనగరం ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె. తేజేశ్వరరావు మాట్లాడుతూ గిరిజన రైతులు పసుపు, అల్లం సాగు చేసే పంట పొలాల్లో అంతర పంటలుగా ఉద్యాన పంటలను సాగు చేసుకోవాలన్నారు. గిరిజన ప్రాంతానికి అనువైన, అధిక ఆదాయం సమకూర్చే అవకాడో, లిచి, రామ్‌భూటాన్ మొక్కలను సాగు చేసుకోవాలన్నారు. ప్రధాన పంటతోపాటూ ఉద్యాన పంటల వల్ల దీర్ఘకాల ఆదాయం పొందవచ్చునన్నారు. అనంతరం రైతులకు కూరగాయలు, మొక్కజొన్న విత్తనాలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో డివిజన్ ఉద్యానశాఖ అధికారి కంటా బాలకర్ణ పాల్గొన్నారు.

దారెల గ్రామ మహిళల ఔదార్యం

- ప్రయాణికులకు మజ్జిగ, నిమ్మరసం పంపిణీ


రహదారిపై శీతలపానీయాలతో ఉన్న మహిళలు

ముంచంగిపుట్టు, మే 10 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధి దారెల పంచాయతీ కేంద్రానికి చెందిన మహిళలు ఔదార్యాన్ని చాటుకున్నారు. వేసవి కావడంతో పలువురి వాహనదారుల దాహం తీర్చేందుకు శ్రీకారం చుట్టారు. శనివారం ముంచంగిపుట్టునుంచి పెదబయలు వెళ్లే మార్గ మధ్యలోని కిలగాడ జంక్షన్ వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు అటుగా వెళ్లే వారికి చల్లటి మజ్జిగ, నిమ్మరసం కలిపిన నీళ్లను అందించారు. మండల కేంద్రంలో వారపు సంత కావడంతో ఇటుగా వచ్చే బస్సులు, ఆ టోలు, జీపులు, ద్విచక్ర వాహనాలను నిలిపి ప్రయాణికుల దాహం తీర్చారు. ఏటా గ్రామంలో కొంత మంది తమ సొంత డబ్బులు వెచ్చించి రాకపోకలు సాగించే వారి దాహార్తి తీర్చేందుకు కృషి చేస్తున్నట్టు శాంతమ్మ, రత్నమ్మ, లక్ష్మీ, నీలమ్మ, పుష్పవి, శ్రీదేవి, మీనాక్షి, తిరుమల్మ, విజయలక్ష్మీ, దుర్గాదేవి తదితరులు తెలిపారు.

తెల్ల రేషన్ కార్డులు దరఖాస్తుదారుల నిరీక్షణ

- సర్వర్ మొరాయింపుతో సమస్య


సలేరు సచివాలయంలో లబ్దిదారులు

సీలేరు, మే 10 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం సీలేరు సచివాలయంలో సర్వర్ పనిచేయక తెల్లరేషన్‌కార్డుల దరఖాస్తుదారుల గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. ఈ రేషన్ కార్డు కోసం ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసి ప్రక్రియ వరకు బాగానే జరుగుతుందని, అనం తరం ఈకేవైసీకి మా త్రం చాలా సమయం పడుతుందని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. దీనికి తోడు సీలేరు సచివాలయంలో డివైజర్ కూడా సక్రమంగా పనిచేయక సచివాలయం సిబ్బందీ అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఈకెవైసీ డివైజర్ కొత్తది పంపిణీ చేసి ఇబ్బందిలేకుండా లే కుండా చూడాలని పలువురు లబ్ధిదారులు కోరుతున్నారు.

కరాటే శిక్షణ


శిక్షణ పొందుతున్న విద్యార్థులు

పాడేరురూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): పాడేరు సెయింటాన్స్ ఇంగ్లీష మీడియం స్కూల్ ఆవరణలో ప్రారంభమైన సమ్మర్ కరాటే శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ సిస్టర్ శినా కోరారు. విలేకరులతో ఆమె మాట్లాడుతూ కరాటేతో కలిగే ఉపయోగాలను ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులతో పాటు చింతపల్లి ప్రభుత్వ డిగ్రీకళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌పడాల్, హుకుంపేట ఎంఈవో ఈశ్వరరావు, కరాటే చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ బాకూరు పాండురాజు పాల్గొన్నారు.

27న సీపీఐ మండల మహాసభ

కొయ్యూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): రావణాపల్లి లో ఈ నెల 27న సీపీఐ మండల మహాసభ నిర్వహించనున్నట్టు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ తెలిపారు. శనివారం మండలంలో అంతాడ పంచాయతీ కొత్తపల్లిలో పార్టీ మండల సమితి సమావేశం నాయకుడు గుమ్మ రాంబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మం డల కార్యదర్శి ఇరువాడ దేముడు, గిరిజన సమాఖ్య అధ్యక్షుడు సతీశ్, వ్యవసాయ కార్మిక జిల్లా అధ్యక్షుడు వియ్యపు నానాజీ, స్థానిక ఎంపీటీసీ సభ్యులు సత్యవాణి, గిరిజన సమాఖ్య నేత దార మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.


ఆర్టీసీ బస్సులను ప్రారంభిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు

▸▸ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, మే 10 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఏపీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సూచించారు. నర్సీపట్నం ఆర్టీసీ డిపోలో శనివారం హైదరాబాద్, కాకినాడ వెళ్లే నూతన బస్సులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపో యాజమాన్యం ప్రయాణికులకు అందించాల్సిన సౌకర్యాలపై తమ వంతు బాధ్యత వహించాలన్నారు. కాకినాడ, హైదరాబాద్‌లకు రెండో సర్వీసు ప్రారంభించడం ప్రయాణికులకు మరింత సౌకర్యంగా ఉంటుందన్నారు. ప్రతి నెలా అద్దె బస్సుల ద్వారా వచ్చే ఆదాయంతో డిపోలో అభివృద్ధి పనులు చేపట్టాలని ఆయన సూచించారు. అనంతరం డిపోలో సౌకర్యాలను పరిశీలించి మరుగుదొడ్ల నిర్వహణ, డిపో భవనాలకు రంగులు వెలిపోడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తక్షణమే ఈ పనులు చేపట్టాలని డిపో సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

గృహ నిర్మాణదారులకు సీలింగ్ ఫ్యాన్లు


గృహ నిర్మాణ లబ్ధిదారులకు సీలింగ్ ఫ్యాన్లు పంపిణీ చేస్తున్న ఏఈ

మాకవరపాలెం, మే 10 (ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణదారులకు ప్రభుత్వం ప్రభుత్వం సీలింగు ఫ్యాన్లను అందిస్తున్నట్టు ఆ శాఖ ఏఈ ప్రేమానందం తెలిపారు. మండలంలోని గిడుతూరు గ్రామంలో ఆదివారం లబ్ధిదారులకు సీలింగు ఫ్యాన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఇంటి నిర్మాణాలు పూర్తిచేసిన ప్రతీ లబ్ధిదారుడికి రెండు సీలింగు ఫ్యాన్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. మండలంలో మొదటి విడతగా 62 ఫ్యాన్లు వచ్చాయన్నారు. వీటిని మాకవరపాలెం, తామరం, గిడుతూరు, రామన్నపాలెం, బూరుగుపాలెం తదితర గ్రామాల్లో లబ్ధిదారులకు పంపిణీ చేశామన్నారు. ఈ ఫ్యాన్లను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చినబాబు, బుచ్చిరాంప్రసాద్, హౌసింగ్ సిబ్బంది జగన్నాథం పాల్గొన్నారు.

వెంకన్న సన్నిధిలో కుంకుమ పూజలు


వేంకటేశ్వరస్వామి ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

చోడవరం, మే 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణ వేడుకల్లో భాగంగా శుక్రవారం రాత్రి మహిళా భక్తుల ఆధ్వర్యంలో కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని స్వామివారికి కుంకుమ పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు శ్రీమాన్ శేష రామగోపాలాచార్యులు, గుంటూరు శాంతారామాచార్యులు, శ్రీనివాసు, మహిళా భక్త మండలి సభ్యులతో పాటు ఆలయ ప్రోత్సాహకులు ఉపాధ్యాయుల శ్రీనివాసరావు, పనసారెడ్డి, చావలి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

బైన్నవోలులో తల్లికి వందనం


అంగన్‌వాడీ కేంద్రంలో తల్లికి వందనం కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

చోడవరం, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెన్నవోలు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లికి వందనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తల్లులను గౌరవించే కార్యక్రమాన్ని చేపట్టారు.ఐసీడీ ఎస్ సూపర్‌వైజర్ డి.శ్రీదేవి, అంగన్‌వాడీ కార్యకర్త మజ్జి పద్మ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన యాత్రకు పాడి రైతులు



విజ్ఞాన యాత్రకు తరలివెళ్తున్న మహిళా పాడి రైతులు

చోడవరం, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గవరవరం పాల సంఘానికి చెందిన పాడి రైతులు విజ్ఞాన యాత్రలో పాల్గొన్నారు. విశాఖపట్నంలోని విశాఖ డెయిరీ యూనిట్‌ను శనివారం మహిళా పాడి రైతులు సందర్శించారు. డెయిరీలో పాలు, ఇతర ఉత్పత్తుల తయారీ విభాగాలను వారు తిలకించారు. ఈ యాత్రలో పాల సంఘం అధ్యక్షుడు ఎస్.అప్పలనాయుడు, కార్యదర్శి సాంబమూర్తి, డెయిరీ మేనే జర్ జి.రాము, సూపర్‌వైజర్లు వి.కృష్ణ, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్వారీ లారీకి జరిమానా

కశింకోట, మే 10 (ఆంధ్రజ్యోతి) : అధిక లోడుతో వెళుతున్న క్వారీ లారీకి జరిమానా విధించామని సీఐ అల్లు స్వామినాయుడు తెలిపారు. శనివారం సాధారణ తనిఖీలు నిర్వహించామన్నారు. ఇం తలో ఎలమంచిలి నుంచి కశింకోట వైపు క్వారీ రాయితో వస్తున్న లారీని ఆపి చూడగా, అందులో పరిమితికి మించి లోడు ఉన్నట్టు గుర్తించామన్నారు. వెంటనే వాహనాన్ని అదుపులోకి తీసుకుని ఆర్టీవోకు అప్పగించగా రూ.36వేలు జరిమానా విధించారన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను వాహనాల్లో తరలించినా, అధిక లోడుతో వెళుతున్నా అటువంటి వాహనాలపై చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

పీ-4లో 1681 పేద కుటుంబాలు

▸▸ మునిసిపాలిటీలోని 28 వార్డులలో గుర్తింపు

▸▸ ఎన్‌ఆర్‌ఐలు, సంపన్నులు దత్తత తీసుకోవాలని పిలుపు

▸▸ దత్తత తీసుకుంటే మార్గదర్శిగా గుర్తింపు, ప్రశంసాపత్రం



నర్సీపట్నం, మే 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పీ-4 సర్వే చురుగ్గా సాగుతోంది. మునిసిపాలిటీలో 1681 పేద, నిరుపేద కుటుంబాలను గుర్తించారు. ఇందులో భాగంగా ఏపీ ప్రభుత్వం పేదరిక నిర్మూలన కోసం పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్టనర్‌షిప్ (పి-4) సర్వే పూర్తి చేసిన విషయం తెలిసిందే.

మునిసిపాలిటీలోని సచివాయాల పరిధిలో కూడా పీ-4 సర్వే చేశారు. మునిసిపాలిటీలోని 28 వార్డులలో 19400 కుటుంబాలు ఉండగా, వారిలో 1681 మంది పేద, నిరుపద కుటుంబాలు ఉన్నట్టు గుర్తించారు. రాష్ట్రంలో పేదరికం నిర్మూలనకు పీ4 సర్వేలో గుర్తించిన పేద, నిరుపేద కుటుంబాలను ధనిక వర్గాలు, సంపన్నులు దత్తత తీసుకునే విధంగా ప్రోత్సహిస్తోంది. ఉన్నత శ్రేణి వర్గాలు, సంపన్నులు, ఎన్‌ఆర్‌ఐలు ముందుకు వచ్చి పేద, నిరుపేద కుంటుంబాలను దత్తత తీసుకోవాలని కోరుతోంది. వార్డు పరిధిలో పేద కుటుంబాలతో సంక్షేమ పథకాలకు దరఖాస్తులు పెట్టించడం, మౌలిక సదుపాయాలు కల్పన, ఆర్థికంగా నిలదొక్కుకునే విధంగా ప్రోత్సహించాలని కోరారు. దత్తత తీసుకున్నవారిని మార్గదర్శిగా గుర్తించి ప్రభుత్వం ప్రశంసా పత్రాలు అందజేస్తుంది. పేద, నిరుపేద కుటుంబాలను బంగారు కుంటుంబాలుగా పిలుస్తారు. మునినిసిపాలిటీలో సచివాయల సిబ్బంది సంపన్న వర్గాలకు ఫోన్లు చేసి పీ-4 కార్యక్రమానికి సహకరించాలని మునిసిపల్ సిబ్బంది కోరారు. పేద కుటుంబాలను దత్తత తీసుకుని నిలదొక్కుకోవడానికి అవసరమైన సహకారం చేయాలని విజ్ఞప్తి చేశారు.

చెరకు రైతులు, కార్మికులకు బకాయిలు చెల్లించాలి

▸▸ ఫ్యాక్టరీలో ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి

▸▸ గోవాడ షుగర్స్ ఎండీకి అఖిలపక్షం నాయకుల వినతి


ఎండీకి వినతిపత్రం ఇస్తున్న బీజేపీ, సీపీఐ నేతలు

చోడవరం, మే 10 (ఆంధ్రజ్యోతి): గోవాడ షుగర్ ఫ్యాక్టరీకి చెరకు సరఫరా చేసిన రైతులకు బకాయిలతో పాటు కార్మికులకు వేతనాల చెల్లింపులకు వెంటనే చర్యలు చేపట్టాలని అఖిలపక్షం నాయకులు కోరారు. ఈ మేరకు బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు ఏఆర్‌జీ శర్మ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు శనివారం ఫ్యాక్టరీ ఎండీనికి కలిసి చెరకు రైతుల బకాయిలతో పాటు ఫ్యాక్టరీ స్థితిగతుల గురించి మాట్లాడారు. ఫ్యాక్టరీపై నమ్మకంతో చెరకు సరఫరా చేసిన రైతులను ఇబ్బంది పెట్టకుండా బకాయిలు చెల్లించాలని సూచించారు. ఫ్యాక్టరీలో పని చేస్తున్న కార్మికుల వేతన బకాయిలు కూడా చెల్లించాలని కోరారు.

ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు చేయండి

చోడవరం, మాడుగుల ప్రాంత రైతులను ఆదుకోవడానికి గోవాడలో ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటుకు ఎమ్మెల్యే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. రైతాంగాన్ని ఆదుకోవడంతో పాటు వారు ఫ్యాక్టరీపై నమ్మకం పెరిగేలా ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని వారు కోరారు.

భారత ఆర్మీ జవాన్ మరళీనాయక్‌కు ఘన నివాళులు


జవాన్ మరళీనాయక్‌కు నివాళులర్పిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

నర్సీపట్నం, మే 10 (ఆంధ్రజ్యోతి): పాకిస్తాన్ దాడిలో మృతి చెందిన భారత ఆర్మీ జవాన్ మురళీనాయక్‌కు వాకర్స్ క్లబ్ సభ్యులు ఘనంగా నివాళులు అర్పించారు. శనివారం వాకర్స్ క్లబ్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా పహల్గామ్ ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన పర్యాటకులు, పాకిస్తాన్ బాంబుదాడిలో మృతి చెందిన మురళీనాయక్‌కు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం క్లబ్ కార్యదర్శి, న్యాయవాది కామిరెడ్డి సత్యనారాయణ గత ఏడాది చేపట్టిన కార్యక్రమాలు, భవిష్యత్తు కార్యచరణపై వార్షిక నివేదిక అందజేశారు. అలాగే ట్రెజరర్ అల్లు అప్పారావు 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఆదాయం, ఖర్చులు వివరాలు వెల్లడించారు. ప్లాస్టిక్ నిషేధం, స్వచ్ఛ నర్సీపట్నం కోసం కృషి చేయాలని ఈ సందర్భంగా సూచించారు. త్వరలో పెద్ద ఎత్తున రక్తదాన శిబిరం నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఎంఈవో జేఎస్ఎస్ నాగేశ్వరరావు, ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గజ్జాలమ్మ మాస్టారు, ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ బాబీ, సంయుక్త కార్యదర్శులు పి.శ్రీనివాసరావు, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి 23 గొర్రెలు మృత్యువాత

▸▸ రూ.4.5 లక్షల నష్టం


గంధవరంలో మృతి చెందిన గొర్రెలు

చోడవరం, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంధవరం గ్రామంలో శనివారం విద్యుదాఘాతానికి 23 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. దేవర నారాయణ అనే గొర్రెల పెంపకందారుడికి షెడ్డుకు ఉన్న ఇనుప కంచికి సమీపంలోని కరెంటు స్తంభం నుంచి వచ్చిన వైరు తగలడంతో పాకలో ఉన్న గొర్రెలు చనిపోయాయి. వీటి విలువ సుమారుగా రూ.4.5 లక్షలు ఉంటుందని అంచనా. విషయం తెలియడంతో గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంటా శ్రీరామ్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ పల్లా నరసింగరావు, మాజీ సర్పంచులు పల్లా అర్జున, మొల్లి రామకృష్ణ, పల్లా అప్పలకొండ ఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితుడిని ఓదార్చారు. ఈపీడీసీఎల్ ఏడీఈ కుమార్ గౌరీప్రసాద్ ఘనటా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతి చెందిన గొర్రెలకు పశు వైద్యాధికారి పోస్టుమార్టం నిర్వహించారు.

డీఎస్సీకి ఉచిత కోచింగ్

▸▸ బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులకు అవకాశం

అనకాపల్లి రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం నిర్వహించనున్న మెగా డీఎస్సీ-2025కి హాజరయ్యే బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్టు వెనుకబడిన తరగతుల సంక్షేమం, సాధికారత అధికారి కె.రాజేశ్వరి తెలిపారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సంచాలకుల ఆదేశాల మేరకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్‌కు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్న ఆమె పేర్కొన్నారు. టెట్ అర్హత సాధించిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని స్పష్టం చేశారు. అభ్యర్థులు తమ సొంత జిల్లాలోనే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తుతోపాటు కుల ధ్రువీకరణ పత్రం, నేటివిటీ సర్టిఫికెట్, ఆదాయ ధ్రువపత్రం, టెట్‌లో అర్హత సాధించినట్టు సర్టిఫికెట్‌ను జతచేయాలని పేర్కొన్నారు. దరఖాస్తులను అనకాపల్లిలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయంలో అందజేయాలని, మరిన్ని వివరా కోసం 98858 45743, 94949 78777 నంబర్లకు ఫోన్ చేసి సంప్రదించవలసిందిగా ఆమె కోరారు.

భానుడి ప్రతాపానికి జనం విలవిల

మాడుగుల, మే 10 (ఆంధ్రజ్యోతి): భానుడి ప్రతాపానికి జనం విలవిలలాడిపోతున్నారు. ఇటీవల కాలంలో ఎన్నడూ లేని విధంగా పగటి ఉష్ణోగ్రత అధికంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో వృద్ధులు, గర్భిణులు, చిన్నారులు ఉక్కపోతతో నానా అవస్థలు పడ్డారు. చెట్టు కొమ్మ కూడా ఊగలేని విధంగా గాలి లేకపోవడంతో ఫ్యాన్ల కింద కూర్చొన్నప్పటికీ ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు.

రేపటి నుంచి ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు

▸▸ నాలుగు కళాశాలల నుంచి 196 విద్యార్థులు

▸▸ పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ కె.శ్రీహరి

కృష్ణాదేవిపేట, మే 10 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం నుంచి ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు జరుగుతాయని చీఫ్ సూపరింటెండెంట్, కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీహరి తెలిపారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఈ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు. కళాశాలలో గొలుగొండ గురుకుల, కస్తూర్బాగాంధీ కళాశాలలతో పాటు స్థానిక ఎల్ఎన్ఎం నాయుడు ప్రైవేటు జూనియర్ కళాశాలలకు చెందిన ప్రథమ సంవత్సరం విద్యార్థులు 130 మంది, ద్వితీయ సంవత్సరం 66 మంది విద్యార్థులు పరీక్షలు రానునున్నారు. కళాశాలలో ఫర్నిచర్, తాగునీరు, మరుగుదొడ్లు తదితర అన్ని సౌకర్యాలతో పాటు పరీక్షా కేంద్రంలో ఎటువంటి మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. ప్రతి రోజూ ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2-30 నుంచి సాయంత్రం 5-30 గంటల వరకు వారం రోజుల పాటు పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ పరీక్షలకు రొలుగుంట కళాశాల అధ్యాపకులు మీరా డిపార్ట్‌మెంట్ అధికారిగా నియమించారని ప్రిన్సిపాల్ తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు

నర్సీపట్నం అర్బన్, మే 10 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. దుగ్గాడ శ్రీరాంపురం గ్రామంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌ను గ్రామ సభ ద్వారా సిద్ధం చేశారు. ప్రకృతి వ్యసాయ సాగులో రైతులు ఆశించినంత దిగుబడులు సాధించవచ్చునని వివరించారు. అనంతరం ఉత్తమ రైతులు కాళ్ల రామకృష్ణ, నల్లబెల్లి కుమారిని సన్మానించారు.

ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు


వినాయక వీధిలో కిందకు వేలాడుతన్న విద్యుత్ వైరు

రోలుగుంట, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొవ్వూరులోని వినాయక వీధిలో విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. చేతికి అందేలా కిందకు వేలాడుతున్న ఈ వైర్లు స్థానిక ప్రజలను భయపెడుతున్నాయి. ఈ వైర్లను తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నా ఫలితం లేకపోతోంది. పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా నేటికీ స్పందన లేదని వారు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. వీధిలో ఇళ్ల మధ్యలో నుంచే విద్యుత్ స్తంభం ద్వారా మరో విద్యుత్ స్తంభానికి వైరు వేలాడుతూ ఉండడం వల్ల గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఆ వీధి మీదుగా వెళ్లే స్థానికులకు చేయి తగి లే స్థితిలోనే వైర్లు ఉండడం వల్ల ఏ సమయంలో ఏ విద్యుత్ ప్రమాదం చోటు చేసుకుంటుందోనని భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధింత అధికారులు తక్షణమే స్పందించి విద్యుత్ వైర్లను సరి చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ర్యాలీ



సమ్మె విజయ వంతం చేయాలని ర్యాలీ చేస్తున్న కార్మికులు, స్కీమ్ వర్కర్లు

రావికమతం, మే 10 (ఆంధ్రజ్యోతి): స్కీమ్ వర్కర్లు, కార్మికుల సమస్యల పరిష్కారాం కోసం ఈనెల 20న తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు మాట్లాడుతూ మాట్లాడుతూ స్కీమ్ వర్కర్లకు కనీసం వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వ రంగంలో సంస్థలను ప్రైవేటీకరణ చేసే ఆలోచనను విరమణ చేయాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, పంచాయతీ వర్కర్లకు రూ.20,600లు వేతనం ఇవ్వాలని, రైతుల పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని విన్నవించారు. ఈ డిమాండ్‌లతో చేపట్టే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముఠా కార్మిక సంఘ అధ్యక్షులు కరణం రమణ, పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు శేషుబాబు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, కార్మికులు పాల్గొన్నారు.

అప్పన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు

సింహాచలం, మే 10 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి భక్తులు శనివారం అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఉత్త రాంధ్ర జిల్లాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాలైన చత్తీస్‌ఘడ్; ఒడిశా సరిహద్దు గ్రామాల నుంచి కూడా తరలివచ్చారు. వేకువజామున సింహాచలం చేరుకుని అక్కడి నుంచి అటవీ ప్రాంతంలో కొలువుదీరిన భైరవస్వామిని దర్శించుకుని కొందరు మెట్ల మార్గంలోను, మరి కొందరు రోడ్డు మార్గంలోను సింహగిరికి చేరుకున్నారు. పవిత్ర గంగధారలో పుణ్యస్నానాలు ఆచరించి,అప్పన్నను దర్శించుకున్నారు. భక్తులు అధికంగా రావడంతో సింహగిరి మాడవీధుల్లో, గంగధార, కేశఖండనశాల, ప్రసాదాల విక్రయ కేంద్రాల వద్ద సందడి నెలకొంది. ఇదిలావుంటే, స్వామివారి నిత్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. తొలుత స్వామివారికి అర్చకులు విశేష పూజలు జరిపారు.

15న జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం

మాడుగుల, మే 10 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్య దైవం మాడుగుల మోదకొండమ్మ జాతర ఏర్పాట్లకు సంబంధించి ఈ నెల 15వ తేదీన జిల్లా అధికారులతో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సమీక్షా సమావేశం నిర్వహిస్తారని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, మోదకొండమ్మ ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ జూన్ నెల 3వ తేదీన జరిగే అమ్మవారి జాతరకు సంబంధించి బస్సు సర్వీసులు, విద్యుత్ సౌకర్యం, తాగునీరు, పారిశుధ్యం తదితర అంశాలపై జిల్లా, మండల స్థాయి అధికారులతో ఈ సమావేశం నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. స్థానిక తులసీ కల్యాణ మండపంలో ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి సమావేశం ప్రారంభిస్తామని ఆయన తెలిపారు.

అల్లూరి పార్కులో ఉచిత యోగా శిక్షణ

కృష్ణాదేవిపేట, మే 10 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు పార్కులో ఉచిత యోగా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్టు యోగా గురువు దీపక్ బలగా చెప్పారు. మానసిక, శారీరక రుగ్మతలను దూరం చేసే శక్తి యోగాకు మాత్రమే ఉందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యోగా ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. యోగాలో ప్రాథమిక ఆసనాలు, సూర్య నమస్కారాలు, సాధన వల్ల అధిక బరువు, అజీర్తి, స్థూలకాయం, నడుం నొప్పి, మల బద్దకం, కీళ్ల నొప్పులు తదితర రోగాలకు యోగా దివ్య ఔషధం వంటిదని యోగా గురువు దీపక్ పేర్కొన్నారు.

అన్నదాత సుఖీభవకు ఆన్‌లైన్ చేసుకోండి: ఏవో

గొలుగొండ, మే 10 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకం కోసం రైతులు పూర్తి వివరాలతో ఆన్‌లైన్ చేసుకోవాలి వ్యవసాయాధికారి సుధారాణి తెలిపారు. ఆయా సచివాలయాల్లోని రైతు సేవా కేంద్రాల్లో రైతులు తమ పట్టాదారు పాసు పుస్తకంతో పాటు ఆధార్, ఆధార్ లింకైన ఫోన్ నంబరుతో సంప్రదించాలని సూచించారు. ఈ నెల 20వ తేదీలోగా గతంలో ఆన్‌లైన్‌లో లేని రైతులు విధిగా చేసుకోవాలని చెప్పారు.

టెన్త్ టాపర్‌కు ఆర్థిక సాయం

రావికమతం, మే 10 (ఆంధ్రజ్యోతి): కొత్తకోట ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించిన కన్నంపేట గ్రామానికి చెందిన సియాద్రి మణికంఠకు గ్రౌండ్‌బాయ్స్ సేవా సంఘ సభ్యులు ఆర్థిక సాయం అందించారు. అనారోగ్యంతో విశాఖపట్నంలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నిరుపేద కుటుంబానికి చెందిన మణికంఠకు వైద్య ఖర్చుల కోసం వారు రూ.15 వేలు తక్షణ సహాయంగా శనివారం కుటుంబ సభ్యులకు అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మాడుగుల, మే 10 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతులు చేపట్టేందుకుగాను ఆదివారం ఉదయం నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని నర్సీపట్నం ఈఈ కేపీఎస్.అప్పారావు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు మాడుగుల సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ ఉండదని స్పష్టం చేశారు. ఈ అంతరాయాన్ని వినియోగదారులు గమనించి తమకు సహకరించాలని ఆయన కోరారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తే సహించం

జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి రాజు

రోలుగుంట, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిబంధనలకు విరుద్ధంగా మైనింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తే సహించబోమని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు శనివారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. రోలుగుంట మండలం రాజన్నపేటలో నిబంధనలకు విరుద్ధంగా క్వారీ యాజమాన్యం ఆక్రమించిన చెరువు ప్రాంతాన్ని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని రోడ్డు తొలగించడం హర్షనీయమన్నారు. ఇప్పటికీ రాజన్నపేట క్వారీ యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ అక్రమ మైనింగ్ చేస్తున్నారని, ఉన్నతాధికారులు దృష్టి సారించి భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

పరారీలో ఉన్న గంజాయి నిందితుడి అరెస్టు

నర్సీపట్నం, మే 10 (ఆంధ్రజ్యోతి): రెండేళ్లగా పరారీలో ఉన్న గంజాయి నిందితుడ్ని అరెస్టు చేసినట్టు రూరల్ సీఐ రేవతమ్మ తెలిపారు. నర్సీపట్నం మండలం గబ్బాడకు చెందిన మాకిరెడ్డి రాజశేఖర్ 2013లో 18 కిలోల గంజాయితో కారును వదిలేసి పారిపోయాడు. ఆయనపై రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అప్పటి నుంచి పోలీసులు నుంచి తప్పించుకొని తిరుగుతున్నాడు. శనివారం నిందితుడు ఆచూకీ తెలుసుకొని అరెస్టు చేసినట్టు సీఐ రేవతమ్మ తెలిపారు.

పాత నేరస్థులకు కౌన్సెలింగ్

రూరల్ సర్కిల్ పరిధిలోని పాత నేరస్థులకు సీఐ రేవతమ్మ శనివారం సాయంత్రం కౌన్సెలింగ్ ఇచ్చారు. వారిలో సత్ప్రవర్తన రావాలని ఆమె సూచించారు. గత జీవితాన్ని మరిచిపోయి నూతన జీవన విధానాన్ని అలవాటు చేసుకోవాలని చెప్పారు. స్వయం ఉపాధి చూసుకొని సమాజంతో గౌరవప్రదంగా బతకాలని ఆమె సూచించారు.

భూసార పరీక్షలతో పంటలకు మేలు

పోషక పదార్థాల లోపాన్ని సరిదిద్దుకునే అవకాశం

- ఉచితంగా పరీక్షలు చేయిస్తున్న వ్యవసాయ శాఖ
- మట్టి నమూనాల సేకరణపై రైతులకు అవగాహన



మట్టి నమూనా సేకరిస్తున్న వ్యవసాయ సిబ్బంది, రైతులు (ఫైల్‌ఫొటో)



మట్టి నమూనా తీసే పద్ధతి

అనకాపల్లి అగ్రికల్చర్, మే 10 (ఆంధ్రజ్యోతి):

భూసారం ఎప్పుడు ఒకేలా ఉండదు. పొలంలో సాగు చేసే పంటలు, వేసే ఎరువులు, వినియోగించే క్రిమి సంహారక మందులు.. భూసారంలో మార్పులకు కారణం అవుతుంటాయి. మొక్కల పెరుగుదలకు 16 రకాల పోషక పదార్థాలు అవసరం. కొన్ని పోషక పదార్థాలు నేలలో సహజంగానే హెచ్చు, తగ్గులుగా ఉంటాయి. మరికొన్ని పోషక పదార్థాల లోపం ఎక్కువగా ఉంటుంది. ఏ పోషక పదార్థం తక్కువగా ఉందో దానిని రైతులు భర్తీ చేసుకోవాలి. దీనిని తెలుసుకునేందుకు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలి.

పొలం మొత్తంలో భూసారం ఒకేలా వుం డదు. అందువల్ల సరైన పద్ధతిలో మట్టి నమూనాలను సేకరించాలి. నేల రంగు, రకం, మెరక, పల్లాలను అనుసరించి మట్టి నమూనాలు తీసు కోవాలి. పై విధంగా కాకుండా ఎటువంటి మార్పులు లేకుండా పొలమంతా ఒకేలా ఉంటే ఐదు ఎకరాలకు ఒక మట్టి నమూనా సరిపోతుంది. పొలం దున్నిన తరువాత, ఎరువులు వేయకముందు నమూనాలను సేకరించాలి. మాగాణి భూముల్లో నీరు పెట్టక ముందే మట్టి నమూనా తీయాలి. చవిటి నేలల్లో నమూనాలను వేసవిలో తీయడం మంచిది.

మట్టినమూనా తీసే పద్ధతి

మట్టి నమూనా తీయదలచుకున్నచోట నేలపై ఉండే ఆకులను తీసివేయాలి. పై నుంచి లోపలికి నాగలిచాలు లోతున ఒకే విధమైన నమూనాను తీయాలి. పార లేదా తాపీతో ఇంగ్లిష్ అక్షరం 'వి' ఆకారంలో ఆరు నుంచి తొమ్మిది అంగుళాల లోతున తవ్వి, ఆ గుంత నుంచి ఒక అంగుళం మందాన పైనుంచి అడుగుదాకా సమానంగా ఒక వైపు నుంచి మట్టి సేకరించాలి. ఈ విధంగా 10 నుంచి 12 చోట్ల నుంచి మట్టిని సేకరించి మొత్తం మట్టిని ఒక శుభ్రమైన గోనెపై వేసి బాగా కలపాలి. బాగా కలిపిన మట్టిని నాలుగు సమభాగాలుగా చేసి, ఎదురెదురు భాగాలు అంటే 1, 4 భాగాలు కలిపి మిగతా భాగాలు అంటే 2, 3 భాగాలు తీసివేయాలి. ఈ విధంగా అరకిలో మట్టి వచ్చే వరకు నమూనాను తగ్గించుకుంటూ రావాలి. సేకరించాలి.

పండ్ల తోటల్లో..

పండ్ల తోటల్లో భూసార పరీక్ష చేయించదలచిన రైతులు తమ తోటల్లో ఆరు అడుగుల పొడవు, మూడు అడుగుల వెడల్పు, మూడు అడుగుల లోతున గొయ్యి తవ్వి, రెండు, మూడు రోజులు ఆరనివ్వాలి. తరువాత ప్రతి అడుగుకు ఒక నమూనా చొప్పున మొత్తం ఆరు నమూనాలను సేకరించాలి. ప్రతి నమూనాను, అది ఏ అడుగుకు సంబంధించినదో తెలియజేసే సమాచార పత్రం ఉంచాలి. మట్టి నమూనాలను శుభ్రమైన చిన్న గుడ్డ సంచిలో లేదా ప్లాస్టిక్ సంచిలో వేసి, దాని వివరాలను కాగితంపై రాసి జతజేయాలి. రైతు పేరు, చిరునామా, సర్వే నంబర్, నమూనా సేకరించిన తేదీ, మెట్ట లేదా మాగాణి, నీటి వసతి వివరాలు, గత సంవత్సరం వేసిన పంటలు, ఈ సంవత్సరం వేసే పంట వివరాలు తెలియజేయాలి. ఇంకా ఏమైనా ప్రత్యేక సమస్యలు ఉంటే వాటిని తెలియజేయాలి.

25 వేల మట్టి నమూనాల సేకరణ లక్ష్యం



మండల వ్యవసాయాధికారుల ఆధ్వర్యంలో మట్టి నమూనాల సేకరణ జరుగుతున్నది. ఈ ఏడాది జిల్లాలో 25 వేల మట్టి నమూనాలను పరీక్షించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. సాయిల్ హెల్త్ కార్డ్ యాప్‌లో జియోట్యాగింగ్ చేయడం ద్వారా సేకరించిన నమూనాల ఫలితాలను భూసార పరీక్షల కార్డుల్లో నమోదు చేసి రైతులకు అందజేస్తాం. వ్యవసాయ శాఖ సేకరించే మట్టి నమూనాల పరీక్ష ఉచితం. రైతులు సొంతంగా మట్టి నమూనాలను పరీక్ష చేయించుకోవాలంటే ఒక్కో నమూనాకూ రూ.100 చొప్పున రుసుము చెల్లించాలి. సేంద్రీయ కర్బనం, పొటాష్, నత్రజని, జింకు లోపాలను తగ్గించుకునేందుకు పచ్చిరొట్ట ఎరువులు, జిప్సమ్ వేయాలి. ప్రకృతి వ్యవసాయం భూసారం వృద్ధికి దోహదం చేస్తుంది.

జె.ప్రసాద్, ఏడీ, జిల్లా భూసార పరీక్షా కేంద్రం



మట్టి నమూనాలను ల్యాబ్‌లో పరీక్షిస్తున్న వ్యవసాయ నిపుణులు

మట్టి నమూనా సేకరణలో జాగ్రత్తలు

నమూనా సేకరణకు ఉపయోగించే పరికరాలు పరిశుభ్రంగా ఉండాలి. నమూనా తీయదలచిన పొలంలో సారం మరీ ఎక్కువగాను, మరీ తక్కువగాను ఉన్న చోట్ల మట్టి నమూనాలను విడివిడిగా సేకరించాలి. చెట్ల కింద, గట్ల పక్కన, కంచెల దగ్గర, పశువుల ఎరువు నిల్వ ఉంచిన చోట్ల నుంచి నమూనాలు తీయకూడదు. నీరు నిలిచి బురదగా ఉన్న నేల నుంచి మట్టి నమూనాలు తీయకూడదు. ఒకవేళ బురదలో నమూనాలను తీయవలసి వస్తే ఆ మట్టిని నీడలో ఆరబెట్టాలి. ఎట్టి పరిస్థితుల్లో ఎండలో ఆరబెట్ట కూడదు. రసాయన ఎరువులు వేసిన నెల రోజుల వరకు మట్టి నమూనాలు తీయకూడదు.

స్థూల పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాషియం, సూక్ష్మ పోషకాలైన జింకు, ఇనుము, మాంగనీస్, బోరాన్, రాగి, గంధకం ఏ మేరకు ఉన్నాయో ఈ పరీక్షల ద్వారా తెలుస్తుంది. అదే విధంగా ఉదజని సూచిక (పిహెచ్), లవణ సూచిక, సేంద్రీయ కర్బనం ఏ స్థాయిలో ఉన్నాయో తెలుస్తుంది.

తాండవ కాలువలకు కొత్త రూపు

... 5వ పేజీ తరువాయి

కాలువలో పూడిక తీయించాలని నర్సీపట్నం ఎమ్మెల్యే, శాసనసభ స్పీకర్ అయిన సీహెచ్ అయ్యన్నపాత్రుడుని కలిసి విజ్ఞప్తి చేశారు. ఆయన ఉన్నతాధికారులు, సంబంధిత శాఖల మంత్రులతో మాట్లాడి, ఉపాధి హామీ పథకం కింద తాండవ కాలువల్లో పూడిక తీయించేలా కృషి చేశారు. దీంతో రూ.1.5 కోట్లతో తాండవ కుడి, ఎడమ కాలువల్లో పూడికతీత పనులు చేపట్టారు. గట్లపై తుప్పలను నరికి వేస్తున్నారు. ఇప్పటికే చాలా వరకు పనులు పూర్తయ్యాయి. కొత్త రూపును సంతరించుకున్న పంట కాలువలను చూసి రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సాగునీటి కోసం గత ఐదేళ్లపాటు పడి కష్టాలు తొలగినట్టేనని అన్నదాతలు చెబుతున్నారు. కాగా మదుములు, అక్విడక్టులకు కూడా మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

పాడేరులో పండుగ

- నేటి నుంచి మోదకొండమ్మ ఉత్సవాలు
- మూడు రోజుల పాటు నిర్వహణకు భారీ ఏర్పాట్లు
- నేడు శతకంపట్టులో కొలువుదీరనున్న అమ్మవారు

(పాడేరు-ఆంధ్రజ్యోతి)

మన్యంవాసుల ఆరాధ్య దేవత పాడేరు మోదకొండమ్మ ఉత్సవాలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభం కానున్నాయి. మూడు రోజులపాటు వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ, ఐటీడీఏ యంత్రాంగం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. మోదకొండమ్మను అత్తవారి ఇంటి నుంచి పుట్టింటికి తీసుకువచ్చే తంతుతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. స్థానిక ఆలయం(అత్తవారిల్లు) నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహం, పాదాలను ఆదివారం ఉదయం భారీ ఊరేగింపుతో అమ్మవారి పుట్టిల్లుగా భావించే శతకంపట్టు పందిరిలో ఉంచుతారు. దీంతో మోదకొండమ్మ ఉత్సవాలు మొదలవుతాయి. సోమ, మంగళవారాలు కూడా శతకంపట్టులోనే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. మంగళవారం సాయంత్రం శతకంపట్టు నుంచి అమ్మవారిని తిరిగి ఆలయానికి చేర్చడం(అనుపోత్సవం)తో ఉత్సవాలు ముగుస్తాయి. మోదకొండమ్మ ఉత్సవాలను పురస్కరించుకుని వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన కార్యక్రమాలు, పథకాలపై అధికారులు స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. ఉత్సవాలకు వచ్చే వారంతా ఉత్సాహంగా, ఆనందంగా గడిపేందుకు సంప్రదాయ, వినోద కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు. మోదకొండమ్మ ఉత్సవాలకు పోలీసు అధికారులు 900 మందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

భారత్‌తో పెట్టుకుంటే పాక్ నాశనమే

... 5వ పేజీ తరువాయి

పాల్గొన్నాను. అరేబియా మహా సముద్రంలో పాకిస్థాన్ యుద్ధ విమానాలు, జలాంతర్గాములను వేటాడేందుకు 'ఐఎన్ఎస్ కుఠార్' యుద్ధనౌకలో సిగ్నల్ కమ్యూనికేషన్ ఆఫీసర్‌గా పనిచేశాను. మరో రెండు యుద్ధ నౌకలు ఐఎన్ఎస్ ఖుక్రీ, కిర్పాన్ కూడా అదే సముద్రంలో సేవలు అందించాయి. పాకిస్థాన్‌కు చెందిన జలాంతర్గామి దాడిలో (టార్పెడోలు ఫైరింగ్) ఐఎన్ఎస్ ఖుక్రీ మునిగిపోయింది. ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు. పదుల సంఖ్యలో సిబ్బంది ప్రాణాలను మేము కాపాడాం. పద్దెనిమిది రోజుల పాటు జరిగిన యుద్ధంలో పాక్ విమానాలు, సబ్ మెరైన్స్‌పై దాడి చేసే లక్ష్యంతో ముందుకుకదిలాం. నాడు పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో భారత్ అద్భుతమైన పోరాటాన్ని కొనసాగించింది. కరాచీ కూడా ఆధీనంలోకి వచ్చింది. అప్పుడు కాల్పుల విరమణ ప్రకటన రాకపోయి ఉండి ఉంటే ఇప్పుడు ఇటువంటి పరిస్థితులు ఉండేవి కావు. కానీ, ప్రభుత్వం అప్పటి పరిస్థితుల దృష్ట్యా కాల్పుల విరమణ ప్రకటించడంతో భారత సైన్యం వెనక్కి వచ్చింది.

అత్యంత బలంగా భారత్

1971తో పోలిస్తే ఇప్పుడు బలమైన ఆయుధ సంపత్తి మన సొంతం. 250 యుద్ధ నౌకలు, బ్రహ్మోస్ క్రూయిజ్ మిస్సైల్స్ అధునాతన యుద్ధ విమానాలు సుఖోయ్ 30, రాఫెల్ వంటివి ఉన్నాయి. ఎయిర్ క్రాఫ్టులు సొంతంగా తయారు చేసుకుంటున్నాం. మిస్సైల్స్‌ను పడగొట్టే రాకెట్స్ తయారు చేశాం. అత్యాధునిక జామర్ వ్యవస్థ ఉంది. జామర్స్ ద్వారా మిస్సైల్ ఫ్రీక్వెన్సీని పట్టుకుని జామ్ చేసే సామర్థ్యం కలిగి ఉన్నాం. సబ్ మెరైన్స్, న్యూక్లియర్ సబ్ మెరైన్స్ ఉన్నాయి. 25 సబ్‌మెరైన్‌లు ఉంటే అందులో ఎనిమిది సబ్ మెరైన్‌లు న్యూక్లియర్ వార్ హెడ్స్‌ను రిలీజ్ చేసే సామర్థ్యం కలిగి ఉన్నాయి.

త్రివిధ దళాలు సర్వ సన్నద్ధం

భారత్ త్రివిధ దళాలు నిరంతరం సర్వసన్నద్ధంగా ఉంటాయి. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లో పని చేసే సిబ్బంది దేశభక్తితో పనిచేస్తారు. ప్రాణాలు ఇచ్చేందుకు కూడా వెనుకాడరు. ఇక పాకిస్థాన్‌తో యుద్ధం అంటే వేయి రెట్లు కసి, వేగంతో సైన్యం ముందుకు కదులుతుంది. ప్రభుత్వం ముందుకు వెళ్లాలని భావిస్తే మాత్రం పాకిస్థాన్‌కు తగిన బుద్ధి చెప్పడం ఖాయం. ఈ విషయంలో భారత్ శక్తి, సామర్థ్యాలకు తిరుగులేదు.

పాకిస్థాన్ చేసేదేమీ లేదు..

పహల్గాంలో ఉగ్రమూకలు అమాయకులైన పర్యాటకులను చంపారు. మనం ఉగ్రవాద శిబిరాలపై దాడులు చేస్తే, పాకిస్థానేమో భారత్‌పై దాడులకు తెగబడుతోంది. అంటే, ఇంకా పాకిస్థాన్ బుద్ధి మారలేదు. ప్రస్తుత పరిస్థితుల్లో పాకిస్థాన్ చేసేది ఏమీ లేదు. అగ్రరాజ్యాలు అయిన అమెరికా, రష్యా మన వైపు ఉన్నాయి. కరాచీ పోర్టుపై భారత్ దాడి చేసినట్టు చెబుతున్నారు. అదే జరిగితే పాక్ కోలుకోవడం ఇప్పట్లో సాధ్యం కాదు. మరోవైపు బలూచిస్తాన్ వాళ్లు తిరగబడుతుండడంతో అంత ర్యుద్ధంతో అల్లాడుతోంది. అక్కడ క్షేత్రస్థాయిలో అత్యంత దారుణమైన పరిస్థితులు ఉన్నాయి. అన్నింటికంటే భారత్ సైన్యం దేశభక్తితో పని చేస్తుంది. కాబట్టి, మన సైన్యాన్ని ఎదుర్కోవడం పాకిస్థాన్‌కు అంత సులభం కాదు.

మోదకొండమ్మ జాతరకు 50 ప్రత్యేక బస్సులు

విశాఖపట్నం, మే 10 (ఆంధ్రజ్యోతి):

పాడేరు మోదకొండమ్మ జాతరకు విశాఖ రీజియన్ నుంచి 50 ప్రత్యేక సర్వీసులు నడిపేందుకు ఆర్టీసీ విశాఖ రీజియన్ యాజమాన్యం నిర్ణయించింది. పాడేరులో ఆదివారం నుంచి మూడు రోజులు మోదకొండమ్మ జాతర జరుగనుంది. భారీ ఎత్తున జరిగే ఈ జాతరకు విశాఖ నుంచి ఎక్కువ మంది వెళ్లే అవకాశం ఉండటంతో వారికి రవాణా సౌకర్యాలు కల్పించేందుకు ఆర్టీసీ విశాఖ రీజియన్ ఈ ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఏర్పాట్లు చేస్తోంది. విశాఖపట్నం, గాజువాక, స్టీల్‌సిటీ డిపోల నుంచి ఈ బస్సులు నడపనున్నట్టు రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు. ఆదివారం 10, సోమవారం 15, మంగళవారం 25 ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఈ మూడు డిపోల నుంచి బస్సులను ఎంపిక చేశారు. జాతరకు వెళ్లే ప్రయాణికుల డిమాండ్ ఎక్కువగా ఉంటే అందుకు తగ్గట్టుగానే అధికంగా ప్రత్యేక సర్వీసులు నడుపుతామని అధికారులు తెలిపారు.

డిపో మేనేజర్లు గంగాధర్ (విశాఖపట్నం), ప్రవీణ (గాజువాక), గౌతమ్ చటర్జీ (స్టీల్‌సిటీ) ఈ ప్రత్యేక సర్వీసుల నిర్వహణను పర్యవేక్షిస్తారని ఆయన తెలిపారు. మోదకొండమ్మ జాతరకు వెళ్లే వారంతా ఆర్టీసీ కల్పించే ఈ రవాణా సౌకర్యాలు వినియోగించుకోవాలని ఆర్ఎం కోరారు.

శ్రీకాకుళం రోడ్డు-చర్లపల్లి మధ్య ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, మే 10 (ఆంధ్రజ్యోతి): వేసవి రద్దీని దృష్టిలో ఉంచుకుని దువ్వాడ మీదుగా శ్రీకాకుళం రోడ్డు-చర్లపల్లి మధ్య ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. చర్లపల్లి-శ్రీకాకుళం రోడ్డు-చర్లపల్లి: 07421 నంబరుతో రైలు ఈ నెల 13, 20, 27, జూన్ 3, 10, 17, 24న (ప్రతి మంగళవారం) ఉదయం 6.55 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి అదేరోజు రాత్రి 7.55 గంటలకు దువ్వాడ, 10.45 గంటలకు శ్రీకాకుళం రోడ్డు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 07422 నంబరుతో రైలు ఈ నెల 14, 21, 28, జూన్ 4, 11, 18, 25న (ప్రతి బుధవారం) 00.30 గంటలకు (మంగళవారం అర్ధరాత్రి 12.30 గంటలకు) శ్రీకాకుళం రోడ్డులో బయలుదేరి అదే రోజు (బుధవారం) వేకువజాము 3.20 గంటలకు దువ్వాడ, మధ్యాహ్నం 3 గంటలకు చర్లపల్లి చేరుతుందన్నారు.

చర్లపల్లి-శ్రీకాకుళం రోడ్డు-చర్లపల్లి: 07475 నంబరుతో రైలు ఈ నెల 12, 19, 26, జూన్ 2, 9, 16, 23న (ప్రతి సోమవారం) ఉదయం 4.30 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి అదేరోజు మధ్యాహ్నం 2.30 గంటలకు దువ్వాడ, సాయంత్రం 5.30 గంటలకు శ్రీకాకుళం రోడ్డు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 07476 నంబరుతో రైలు ఈ నెల 12, 19, 26, జూన్ 2, 9, 16, 23న (ప్రతి సోమవారం) రాత్రి 7.30 గంటలకు శ్రీకాకుళం రోడ్డులో బయలుదేరి రాత్రి 10 గంటలకు దువ్వాడ, మరుసటిరోజు ఉదయం 9.15 గంటలకు చర్లపల్లి చేరుతుందన్నారు.

క్రైం... crime news

ఉరి వేసుకుని కార్మికుడి ఆత్మహత్య



అర్జు పాంగి

కశింకోట, మే 10 (ఆంధ్రజ్యోతి): రేకుల షెడ్డులో ఐరన్ పైపునకు ఉరి వేసుకుని ఓ కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనకు సంబంధించి ఏఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రానికి చెందిన అర్జు పాంగి (25) కొంత కాలంగా ఉగ్గినపాలెంలోని అప్పాజీ అసోసియేషన్ బాటిల్స్ ప్రాసెసింగ్ యూనిట్‌లో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. పాంగి అన్నయ్య కామూరు పాంగి, తమ్ముడు త్రినాథ్ పాంగిలకు ఇటీవల వివాహాలు జరిగాయి. అయితే తనకు వివాహం కావడం లేదని తీవ్ర మనస్థాపం చెందిన పాంగి మూడు రోజులుగా పనిలోకి వెళ్లకుండా గదిలోనే ఉండిపోయాడు. శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో మనస్థాపంతో ఉరేసుకొని మృతి చెందాడు. ఎన్టీఆర్ ప్రభుత్వాసుపత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం చేసి కటుంబ సభ్యులకు అప్పగించామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు.

ప్రమాదవశాత్తూ వృద్ధుడి మృతి



మృతి చెందిన దత్తాత్రేయుడు

అనకాపల్లి టౌన్, మే 10 (ఆంధ్రజ్యోతి): శారదానది వంతెనపై నుంచి ప్రమాదవశాత్తూ ఒక వృద్ధుడు శనివారం కిందపడి మృతి చెందినట్టు పట్టణ ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపారు. ఎస్ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. కొత్తూరు పంచాయతీ సాయి నగర్ కాలనీకి చెందిన రిటైర్డు ఉద్యోగి రాపేటి దత్తాత్రేయుడు (70) శనివారం నది వంతెనపైన పాదచారులు నడిచే గట్టుపై వస్తుండగా ఒళ్లు జోగి ప్రమాదవశాత్తూ వంతెనపై నుంచి నది ఒడ్డున పడిపోయాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య లీలా వెంకటగణేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఈశ్వరరావు తెలిపారు.

కారును ఢీకొన్న ఆటో

- ఏడుగురికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో

కొత్తూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): కారును ఆటో ఢీకొనడంతో ఏడుగురు గాయపడ్డారు. వీరిలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. అనకాపల్లి మండలం బవులవాడ వద్ద శనివారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి అనకాపల్లి రూరల్ ఎస్ఐ జి.రవికుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అంబేరుపురం నుంచి అనకాపల్లి వైపు వస్తున్న ఆటో బవులవాడ వద్ద ఎదురుగా అనకాపల్లి నుంచి చోడవరం వైపు వెళ్తున్న కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో అదుపు తప్పి పక్కకు దూసుకుపోయింది. దీంతో ఆటో ముందు భాగం దెబ్బతినగా, ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు గాయపడ్డారు. వీరంతా అంబేరుపురం నుంచి అనకాపల్లి గవరపాలెం ప్రాంతానికి పెళ్లి నిమిత్తం వెళుతున్నారు. డ్రైవర్ అజాగ్రత్తగా నడపడమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని ఎస్ఐ తెలిపారు. ఆటో డ్రైవర్ నాగరాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. సంఘటనా స్థలాన్ని అనకాపల్లి రూరల్ సీఐ జి.అశోక్‌కుమార్ పరిశీలించారు.

బాలికను మోసగించిన కేసులో ముగ్గురు యువకులకు రిమాండ్

చీడికాడ, మే 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఓ బాలిక గర్భం దాల్చిన కేసులో ముగ్గురు యువకులకు చోడవరం కోర్టు రిమాండ్ విధించినట్టు ఎస్ఐ బి.సతీశ్ తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి శనివారం రాత్రి ఎస్ఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భీమిలి రెసిడెన్షియల్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న బాలికకు, చీడికాడ గ్రామానికి చెందిన ఓ బాలుడు విశాఖ మదురువాడలో ఇంజినీరింగ్ చదువుతూ పరిచయమయ్యాడు. ఈ క్రమంలో బాలికతో సదరు బాలుడు శారీరకంగా కలవడంతో గర్భం దాల్చింది. దీంతో పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు మూడు నెలల క్రితం కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా బాలుడు ప్రమేయం ఉన్నట్టు తేలింది. ఈ మేరకు బాలుడ్ని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి తీర్పుతో జువెనైల్ హోమ్‌కు తరలించామని ఎస్ఐ చెప్పారు. తదుపరి దర్యాప్తులో చీడికాడ గ్రామానికి చెందిన కిల్లి మహేశ్, బుద్ద కుమారస్వామి, మంచాల గ్రామానికి చెందిన చుక్క శ్రీను 2024లో బెదిరించి తనను కలిసినట్టు బాలిక చెప్పడంతో శుక్రవారం సాయంత్రం విశాఖ డీఎస్పీ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. అనంతరం శనివారం చోడవరం కోర్టులో హాజరుపర్చగా ముగ్గురు యువకులకు 14 రోజుల పాటు రిమాండ్ విధించడంతో విశాఖ కేంద్ర కర్మాగారానికి తరలించామని ఆయన చెప్పారు.

పాఠశాలల పునర్వ్యవస్థీకరణ

... 5వ పేజీ తరువాయి

ఒకటి, రెండు రోజుల్లో అధికారికంగా ఉత్తర్వులు వెలువడనున్నాయి.

కొత్తగా అమలులోకి రానున్న విధానం ప్రకారం అనకాపల్లి జిల్లాలో 1,396, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1,200, విశాఖపట్నం జిల్లాలో 562 పాఠశాలలు ఉంటాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 36 ఫౌండేషన్, 925 బేసిక్ ప్రాథమిక, 199 మోడల్ ప్రాథమిక, 13 యూపీ, 16 ఉన్నత, 4 ఉన్నత పాఠశాలలు ప్లస్ బేసిక్ ప్రాథమిక పాఠశాలలు, 9 ఉన్నత పాఠశాలలు ప్లస్ మోడల్ ప్రాథమిక పాఠశాలలు ఉంటాయి. అలాగే అనకాపల్లి జిల్లాలో 151 ఫౌండేషన్, 764 బేసిక్ ప్రాథమిక, 187 మోడల్ ప్రాథమిక, 55 యూపీ, 145 ఉన్నత పాఠశాలలు, 78 ఉన్నత పాఠశాలలు ప్లస్ బేసిక్ ప్రాథమిక పాఠశాలలు, 18 ఉన్నత పాఠశాలలు ప్లస్ మోడల్ ప్రాథమిక పాఠశాలలు ఉంటాయి. అలాగే విశాఖపట్నం జిల్లాలో 41 ఫౌండేషన్, 232 బేసిక్ ప్రాథమిక, 178 మోడల్ ప్రాథమిక, 21 యూపీ, 76 ఉన్నత పాఠశాలలు, 10 ఉన్నత పాఠశాలలు ప్లస్ బేసిక్ ప్రాథమిక పాఠశాలలు, 5 ఉన్నత పాఠశాలలు ప్లస్ మోడల్ ప్రాథమిక పాఠశాలలు ఉంటాయి.

అచ్యుతాపురానికి మహర్దశ

... 5వ పేజీ తరువాయి

భాగంగా అనకాపల్లి- అచ్యుతాపురం రోడ్డు వంద అడుగుల మేర విస్తరణ పనులు ఇప్పటికే మొదలయ్యాయని తెలిపారు. అచ్యుతాపురం జంక్షన్‌లో ఫ్లైఓవర్ వంతెన, హరిపాలెం, మునగపాకల వద్ద భారీ వంతెనల నిర్మాణ పనులు చురుకుగా జరుగుతున్నాయన్నారు. అచ్యుతాపురం జంక్షన్‌లో ట్రాఫిక్ రద్దీని మరింత తగ్గించడానికి రింగ్ రోడ్డు నిర్మిస్తామని, దీనికి ప్రతిపాదనలు కూడా సిద్ధమయ్యాయని ఎమ్మెల్యే చెప్పారు. గాజువాక-అచ్యుతాపురం రోడ్డులో అప్పన్నపాలెం జంక్షన్ నుంచి తమ్మయ్యపేట, భోగాపురం మీదుగా ప్రత్యేక ఆర్థిక మండలి ముఖద్వారం వరకు, అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డులో చోడపల్లి నుంచి గాజువాక-అచ్యుతాపురం రోడ్డులో రామన్నపాలెం, ఇటు చోడపల్లి నుంచి ఎలమంచిలి రోడ్డులో వున్న వెంకటాపురం మీదుగా ఎస్ఈజెడ్‌లోని యోకోహామా టైర్ల కర్మాగారం వరకు 100 నుంచి 120 అడుగుల వెడల్పుతో రింగు రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం అయ్యాయని చెప్పారు. మరో మూడు నెలల్లో టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి పనులు ప్రారంభమవుతాయని ఎమ్మెల్యే విజయకుమార్ వెల్లడించారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	110.00
లైవ్ ధర	130.00
విత్ స్కిన్	230.00
స్కిన్ లెస్	240.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509